బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

విశాలాంధ్ర-దుగ్గిరాల : మంగళగిరి శాసనసభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డి దుగ్గిరాల మండలంలోని బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిస్తూ వారికి భరోసాగా నిలుస్తున్నారు. వారి బాధలు తెలుసుకుని వారికి ఆపద్బాంధవుడులా ఆదుకుంటున్నారు. మండలంలోని మంచికలపూడి గ్రామానికి చెందిన ముగ్గురు బాధిత కుటుంబాలకు రూ.55 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గ్రామానికి చెందిన యార్లగడ్డ సత్యనారాయణకు రూ.25 వేలు, గాజులవర్తి దేవిడ్ రాజుకు రూ.15 వేలు, ఏసుపాగ మేరిమ్మకు రూ.15 వేలు మంగళవారం మండల వైసీపీ నాయకుల చేతుల మీదుగా అందించారు. తమ బాధలను తెలుసుకొని తమకు అండగా నిలిచిన ఎమ్మెల్యే ఆర్కేకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దానబోయిన సంతోష రూప వాణి, జడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, గ్రామ సర్పంచ్ యార్లగడ్డ శ్రీచంద్ర దుర్గభవాని, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు, వైసీపీ నాయకులు యేమినేని రవి, యార్లగడ్డ చిన్న, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాలుర హైస్కూల్లో రాగిజావ పంపిణీ

విశాలాంధ్ర-దుగ్గిరాల : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న గోరు ముద్దలో భాగంగా రాగిజావ కార్యక్రమం ప్రారంభించి విద్యార్థులకు పంపిణీ చేసినట్లు ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి తెలిపారు. దుగ్గిరాల జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జడ్పీటీసీ మేకతోటి అరుణ, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వారంలో మూడు రోజులు రాగిజావ పంపిణీ జరుగుతుందని విద్యార్థులు అవకాశాన్ని ఉపయోగించుకోవాలని తెలియజేశారు. ఎంఈఓ శ్రీనివాసరావు, ఎంపీడీవో కుసుమ శ్రీదేవి, ప్రధా నోపాధ్యాయులు బాలసుందరరావు, పులివర్తి పద్మ, సతీష్, రవీంద్రబాబు, కోటేశ్వరరావు, సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉండాలనేదే సీఎం సంకల్పం

విశాలాంధ్ర-పొన్నూరు : పట్టణంలోని ఏఎస్ఎం బాలిక ఉన్నత పాఠశాలలో మంగళవారం జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా రక్తహీనత నివారించుటకు పౌష్టిక ఆహారంలో భాగంగా విద్యార్థులకు రాగి జావను గుంటూరు జిల్లా వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్, పాఠశాల ఎక్స్ అఫిషియో సభ్యుడు బొద్దులూరి రంగారావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఆరోగ్యవంతంగా ఉండాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి దృఢ సంకల్పంతో కోట్లాది రూపాయలు ఖర్చు చేసి రుచికరమైన భోజనం అందిస్తున్నారని దానిలో భాగంగా రాగి జావను కూడా అందించటం హర్షనీయమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు కమిటీ చైర్మన్ గూడపాటి శ్రీనివాస్, హెచ్ఎం జోతిర్మయి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం బొద్దులూరి రంగారావు విద్యార్థులకు గ్లాసులను బహుకరించారు.

అంబరాన్నంటిన ఉగాది సంబరాలు

విశాలాంధ్ర-గుంటూరు : వాసవి వనిత జాగృతి, గుంటూరు డిస్ట్రిక్ట్ వీ217ఏ రీజియన్ 4 జోన్ 2 ఆధ్వర్యంలో స్థానిక అరండల్‌పేటలోని ఒక హోటల్‌లో మంగళవారం నిర్వహించిన ఉగాది సంబరాలు అంబరాన్నంటాయి. ఉగాది వేడుకలలో క్లబ్ సభ్యులే కాకుండా మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని ఆటపాటలతో ఆనందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన న్యాయవాది, క్లబ్ జోన్ చైర్మన్ మాజేటి లక్ష్మీ మాట్లాడుతూ ఉగాది ప్రాముఖ్యతను వివరించారు. క్లబ్ ప్రెసిడెంట్ శ్రీదేవి మాట్లాడుతూ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సహాయ సహకారాలు అందించిన సెక్రటరీ శ్రావణి, ట్రెజరర్ నీలిమలకు అభినందనలు తెలియజేశారు.

మాజీ సైనికుల ఆరోగ్యం కోసం మరింత కృషి

విశాలాంధ్ర-గుంటూరు : ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉన్న మాజీ సైనికులు, వారి కుటుంబాల సభ్యులు 30 వేల మంది ఆరోగ్యం, వారి సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నట్లు ఆంధ్ర, తెలంగాణ ప్రాంత స్టేషన్ కమాండర్, సేనా మెడల్ బ్రిగేడియర్ కె.సోమశేఖర్ అన్నారు. స్థానిక శ్యామలనగర్ మాజీ సైని కుల ఆరోగ్య కేంద్రానికి అనుబంధంగా నూతనంగా నిర్మించిన ఫార్మసీ కేంద్రం, ఫిజియోథెరపీ, సందర్శకులు వేచి ఉండే భవనాలను ప్రారం భించి మాజీ వికలాంగ సిపాయి శ్రీనివాస్‌కు అసోసియేటెడ్ ఆటో సర్వీసెస్ వారు వితరణ చేసిన మూడు చక్రాల వాహనాన్ని అందిం చారు. ఈ సందర్భంగా జరిగిన మాజీ సైనికులు వారి కుటుంబ సభ్యుల ఆత్మీయ సమావేశంలో బ్రిగేడియర్ సోమశేఖర్ మాట్లాడుతూ 2004లో నెలకొల్పిన జిల్లా మాజీ సైనికుల ఆరోగ్య కేంద్రానికి కావల సిన క్లినికల్ సేవలలో అధునాతన వైద్య సదుపాయాలు, పరికరాలతో విస్తరణ చేయబోతున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సైనిక సంక్షేమ శాఖ విశ్రాంత డైరెక్టర్ వెంకటరెడ్డి, హవల్దార్ టి.పోతురాజు, ఆరోగ్య కేంద్రం పాలనాధికారి కల్నల్ సుధాకర్ పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి

దెబ్బతిన్న పంటలను పరిశీలించిన సీపీఐ, రైతు సంఘం నాయకులు

విశాలాంధ్ర-మంగళగిరి : నియోజకవర్గ పరిధిలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు, గాలికి దెబ్బతిన్న పంటలను సీపీఐ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నేతలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, నియోజకవర్గ రైతు సంఘం కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల మండలాలలో(పెదవడ్లపూడి, నూతక్కి, చిర్రావూరు, తుమ్మపూడి, మంచికలపూడి గ్రామాలలో పంట పొలాలను సందర్శించారు)ని గ్రామాలలో అనేక రకాల పంటలు వర్షాలకు దెబ్బతిన్నాయని, అదేవిధంగా మొక్కజొన్న తోటలో ఎక్కువ భాగం గాలికి పాడైపోయిందన్నారు. 10, 15 రోజుల్లో పంట చేతికి వచ్చే సమయంలో మొక్కజొన్న పంట దెబ్బతినటం రైతులకు తీవ్ర నష్టాన్ని కలగజేసిందన్నారు. ఎకరానికి రూ.25 వేల పెట్టుబడి పెట్టి పంట చేతికి వచ్చే సమయానికి భారీ వర్షంతో నష్టపోవటం వల్ల తీవ్రమైన ఆవేదనలో రైతులు ఉన్నారని అన్నారు. అరటి తోటలు భారీ గాలులు, వర్షాలకు నేలకొరిగి తీవ్రమైన నష్టాన్ని మిగిల్చాయన్నారు. అలాగే పసుపు కల్లాలు, మిరప కల్లాల రైతులు కూడా పంటను అమ్ముకోలేని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. ఈ నష్టాన్ని తగ్గించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం చెల్లించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అధికారులను పంపించి సర్వే చేయించి నష్టపరిహారం త్వరగా అందేలాగా చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ పరిధిలో మొత్తం 200 ఎకరాల వరకు నష్టం జరిగిందన్నారు. సొసైటీ పొలాల్లో కూడా పంట నష్టపోయిన ప్రతి ఒక్క రైతును ప్రభుత్వం పరిగణలోకి తీసుకొని వారికి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి నియోజకవర్గ సీపీఐ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య, రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షులు ముసునూరు సుహాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు, రైతు సంఘం నాయకులు సాంబిరెడ్డి, కూరపాటి సింగయ్య తదితరులు పాల్గొన్నారు.

భగత్ సింగ్, సుఖదేవ్, రాజగురుల వర్ధంతి జయప్రదం చేయండి

విశాలాంధ్ర-గుంటూరు : దేశం కోసం ప్రాణాలు విడిచిన భగత్‌సింగ్, సుఖదేవ్, రాజగురుల వర్ధంతిని ఈ నెల 23న జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 200 వందల సంవత్సరాలుగా దేశ సంపదను దోచుకొని దేశ ప్రజలను బానిసలుగా చూసిన బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అతి చిన్న వయస్సులోనే పోరాడి దేశం కోసం ఉరితాడుని పూలమాలగా ధరించి ప్రాణాలు విడిచిన భగత్ సింగ్, సుఖదేవ్, రాజ్ గురులు ఎంతో మంది యువకులు, విప్లవకారులు, విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. వారి వర్ధంతి సందర్భంగా ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో జిల్లాలో పలు చోట్ల ఆటల పోటీలు, రక్తదానం, పేదలకు నిత్యావసరల సరుకుల పంపిణీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాలలో జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు, యువకులు పెద్దఎత్తున పాల్గొనాలని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్ జీ, జిల్లా అధ్యక్షులు పాశం వెంకటేష్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వలి, అధ్యక్షులు చైతన్య, నగర అధ్యక్షులు చల్లా మరియదాసు, సాయి, నీరజ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు రాగిజావ దోహదం

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: పిల్లలందరికీ రాగి జావ ద్వారా అదనంగా పౌష్టికాహారం అందుతుందని, రాగి జావలో ఐరన్, కాల్షియం పుష్కలంగా వుంటాయని, పిల్లలకు రక్తహీనత రాకుండా ఐరన్, ఎముకల పటిష్టతకు కాల్షియం రాగి జావలో లభిస్తాయని జిల్లా కలెక్టర్ వేణుగోపాల రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయం నుండి జగనన్న గోరు ముద్దలో మరో పోషకాహారం రాగి జావను అందించే కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో ప్రారంభించే కార్యక్రమంలో గుంటూరు కలెక్టరేట్ వీసీ హాల్ నుండి కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, శాసన మండలి సభ్యులు మురుగుడు హనుమంతరావు, లక్ష్మణ రావు, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మ తదితరులు పాల్గొన్నారు. రాగి జావ అందించే కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో డీఈవో శైలజ, సివిల్ సప్లయిస్ జనరల్ మేనేజర్ జి.లక్ష్మీ, యంఈఓ ఖుద్దూస్, తదితరులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

ఎంపీ జయదేవ్ ఉగాది శుభాకాంక్షలు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలందరికీ గుంటూరు పార్లమెంట్ సభ్యులు గల్లా జయదేవ్ శోభకృత్ నామ సంవత్సర ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, పాడిపంటలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో అన్ని వర్గాలకు చెందిన ప్రజలందరూ బాగుండాలని ఆ భగవంతుణ్ణి కోరుకుంటున్నాను. శోభకృత్ నామ ఉగాది శాంతి, శ్రేయస్సు, సామరస్యం, సంతోషాన్ని కలిగించాలని, నూతన సంవత్సరంలో సమృద్ధిగా వర్షాలు కురిసి వ్యవసాయ వృద్ధి జరగాలని, కొత్త లక్ష్యాలకు, కొత్త ఆలోచనలకు, ప్రతి ఒక్కరి ఉజ్వల భవిష్యత్తుకు నాంది పలకాలని కోరుకుంటూ, ఇంటింటా ఆయురారోగ్యాలు, సిరిసంపదలు, ఆనందాలు నిండాలని ఆకాంక్షిస్తూ, అందరికి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

కర్నాటి రాంబాబుకు ఘన సత్కారం

విశాలాంధ్ర-మంగళగిరి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సగర సంఘం ఆధ్వర్యంలో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సగర ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే రెండవ అతిపెద్ద గుడి అయిన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి ఆలయ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన కర్నాటి రాంబాబును సగర సంఘం, మంగళగిరి గంగా భగీరథ సగర సంఘం అధ్యక్షుడు పందేటి సాంబశివరావు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సగరులను గుర్తించి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి చైర్మన్‌గా కర్నాటి రాంబాబును నియమించినందుకు గంగా భగీరథ సగరా సంఘం అధ్యక్షుడు పందేటి సాంబశివరావు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాడిశెట్టి మురళి, నంగనాం ప్రసాద్, కర్నాటి శివ సత్యనారాయణ, జుర్రురు ఏడుకొండలు, కటారి విష్ణుమూర్తి, దుంపల సోము, గండికోట వీర రాఘవులు, గండికోట అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉగాది శుభాకాంక్షలు తెలిపిన ధూళిపాళ్ల

విశాలాంధ్ర-పొన్నూరు: పాల ఉత్పత్తిదారులకు, సంగం డెయిరి ఉత్పత్తుల వినియోగదారులకు చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఓ ప్రకటన ద్వారా శ్రీ శుభకృత్ నామ ఉగాది శుభాభినందనలు తెలిపారు. ఇరు తెలుగు రాష్ట్రాలు, దేశ విదేశాలలోని తెలుగు వారందరికి, రైతు సోదరులు, కస్టమర్ దేవుళ్ళకు నూతన తెలుగు సంవత్సరాది, శుభకృత్ నామ ఉగాది పర్వదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. తీపి, చేదు, పులుపు, ఉప్పు, కారం, వగరు (షడ్రుచులు) లా కష్టసుఖాల సమ్మేళనంతో మీ జీవితాలు ముందుకు సాగాలని ఈ నూతన తెలుగు సంవత్సరంలో తెలుగువారందరికీ మరీ ముఖ్యంగా సంగం డెయిరి పాలఉత్పత్తిదారులకు వినియోగదారులకు సహచర పాలకవర్గ సభ్యులు డైరీ ఉద్యోగులకు శుభాభినందనలు తెలియజేశారు. ఈ శుభకృత్ నామ సంవత్సరంలో సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలతో రైతు లోగిళ్ళు దాన్యపు రాశులతో నిండాలని వినియోగదారులకు నాణ్యమైన పాల ఉత్పత్తులు సరసమైన ధరకు లభించాలని ధూళిపాళ్ల ఆకాంక్షించారు. ఈ ఏడాదిలో మీ కుటుంబాలలో సకల శుభాలు జరగాలని మీ జీవితాలలో సంతోషాలు సంగం డెయిరి తరపున పేరు పేరున శుభాకాంక్షలు తెలియజేశారు.

అఖిల భారత ప్రజా నాట్య మండలి జాతీయ కార్యదర్శిగా గని, కౌన్సిల్ సభ్యులుగా ఆరేటి రామారావు ఎన్నిక

విశాలాంధ్ర-పొన్నూరు: జార్ఖండ్ రాష్ట్రంలో ఈనెల 17 నుండి 20వ తేదీ వరకు జరిగిన ఇండియన్ పీపుల్స్ థియేటర్స్ అసోసియేషన్ (అఖిల భారత ప్రజా నాట్యమండలి) జాతీయ మహాసభలలో షేక్ గని జాతీయ కార్యదర్శిగా ఎన్నిక అయ్యారు. ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరేటి రామారావును జాతీయ కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మహాసభలకు వచ్చిన వివిధ రాష్ట్రాల ప్రతినిధులు గని, ఆరేటి రామారావులను అభినందించారు.

ప్రతి ఒక్కరూ పన్ను చెల్లించాల్సిందే : కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: రాష్ట్ర ప్రభుత్వం ఏక మొత్తంగా ఆస్తి, ఖాళీ స్థల పన్నులు చెల్లిస్తే, వాటి పై ఉన్న వడ్డీని మాఫీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని, మరో 10 రోజుల్లో గడువు ముగుస్తుందని ప్రతి ఒక్కరూ నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన పన్నును వెంటనే చెల్లించాలని నగర కమీషనర్ కీర్తి చేకూరి కోరారు. మంగళవారం కమిషనర్ అరండల్ పేటలో ఆస్తి పన్ను బకాయి ఉన్నకమర్షియల్ సంస్థల వద్దకు వెళ్లి పన్ను వెంటనే చెల్లించాలని కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఆస్తి పన్ను చెల్లించడం అనేది ప్రతి భవన యజమాని ప్రాథమిక విధి అని, నగరంలో చేపట్టే అభివృద్ధి పనులకు పన్ను కీలకం కనుక ప్రతి ఒక్కరూ పన్ను విధిగా చెల్లించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా పన్ను పై వడ్డీ రాయితీ ప్రకటించినందున, ఖాళీ స్థల యజమానులు దీర్ఘకాలంగాగ పెండింగ్‌లో ఉన్న పన్నును వడ్డీ లేకుండా చెల్లించడానికి ప్రస్తుతం సువర్ణ అవకాశమని అన్నారు. పర్యటనలో డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, అసిస్టెంట్ సిటీ ప్లానర్ అజయ్ కుమార్, రెవెన్యూ అధికారులు బాలాజీ బాష, పోలేశ్వరరావు, శానిటరీ సూపర్వైజర్ ఆనందకుమార్, ఆర్.ఐ.లు, ఏ.ఈ.లు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

చదువుతోపాటు ఆరోగ్యం ప్రధానం



విశాలాంధ్ర-ఫిరంగిపురం: విద్యార్థులకు చదువుతోపాటు ఆరోగ్యం కూడ ప్రధానాంశమని ఎంపిపి షేక్ షహెలా నర్గీస్ అన్నారు. జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా మండల కేంద్రమైన ఫిరంగిపురం శాంతిపేటలో గల ఎంపిపి పాఠశాలలో ఎంపిపి, జడ్పిటిసి దాసరి కత్తిరేణమ్మ కలిసి విద్యార్థులకు మంగళవారం రాగిజావ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు పోషకాలు కలిగిన బలవర్ధకమైన ఆహారాన్ని అందించేందుకే ప్రభుత్వం 15 రకాల ఆహారా పదార్థాలతోపాటు పాఠశాలల్లో రాగి జావను కూడ అందజేయడం విశేషమన్నారు. అనేక సంక్షేమ పథకాలతోపాటు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి విద్యకు ప్రాధాన్యత కల్పించారని గుర్తు చేశారు. ప్రజల సంక్షేమం కోసం సీఎం జగనన్న సేవలను గుర్తించాలని ఈ సందర్భంగా చెప్పారు. పాఠశాల కమిటీ చైర్మన్ వై.జోస్న, హెచ్ఎం. షేక్ రజాక్, ఉపాధ్యాయులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యార్థులకు రాగిజావ పంపిణీ

విశాలాంధ్ర-తెనాలి : శ్రీసత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ వారి ఆర్థిక సహకారంతో నేటి నుంచి రాష్ట్రంలోని 44,392 పాఠశాలల్లో 1 నుండి 10వ తరగతి వరకు సుమారు 38 లక్షల మంది విద్యార్థులకు జగనన్న గోరుముద్దలో భాగంగా వారానికి మూడు రోజులు మంగళ, గురు, శనివారాల్లో రాగిజావ అందించనున్నారు. ఈ పథకానికి అవసరమైన రాగిపిండి, బెల్లంను 42 కోట్లు ఖర్చుతో 3 సంవత్సరాల పాటు శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ వారు సరఫరా చేస్తారని ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. అంతర్జాతీయ తృణధాన్యాల సంవత్సరంలో భాగంగా విద్యార్థులకు ఐరన్, కాల్షియం సమృద్ధిగా లభించే రాగి, బెల్లం మిశ్రమం జావను అందిస్తున్నట్లు ట్రస్ట్ పేర్కొంది.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

పోలేరమ్మ తల్లి దేవస్థానంలో అన్నదానం

విశాలాంధ్ర-గుంటూరు: గోరంట్ల గ్రామంలోని శ్రీ పోలేరమ్మ తల్లి దేవస్థానంలో మాజీ సర్పంచ్ యర్రంశెట్టి వేణుగోపాల్ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్‌లు ప్రారంభించారు. తొలుత వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వేద పండితుల నుంచి ఆశీర్వాదం స్వీకరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి మేయర్ మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి ప్రతిఒక్కరూ చేయూతనందించాలన్నారు. తులసి ధర్మచరణ్ మాట్లాడుతూ గోరంట్లలోని దేవాలయాల అభివృద్ధికి యర్రంశెట్టి వేణుగోపాల్ నిరంతర శ్రామికునిలా శ్రమిస్తున్నారని, గ్రామస్తులను, సహచర మిత్రులను కలుపుకుంటూ, దేవాలయాల అభివృద్ధి చేపట్టటం గొప్ప సేవ అన్నారు. యర్రంశెట్టి వేణుగోపాల్ మాట్లాడుతూ గోరంట్ల గ్రామ అభివృద్ధికి అందరూ సహకరించటం ఎంతో ఆనందించదగ్గ విషయమని అన్నారు. భవిష్యత్‌లో గ్రామ అభివృద్ధికి మరింత తోడ్పాటు అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు యర్రంశెట్టి పద్మ, దాసరి లక్ష్మీ దుర్గ, యర్రంశెట్టి సూరి, బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఈఓ వ్యవస్థ రద్దు చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు : నగరంలో వందేళ్ల చరిత్ర కలిగిన శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఉన్న ఈఓ వ్యవస్థని వెంటనే రద్దు చేయాలని జనసేన పార్టీ గుంటూరు నగర అధ్యక్షులు నేరేళ్ల సురేష్ డిమాండ్ చేశారు. గతంలో ఈ విషయమై సుప్రీం కోర్టు ఇచ్చిన స్టేని అమలు జరపాలన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య ఇచ్చిన జీఓని వెంటనే అమలు జరపాలన్నారు. ఆర్యవైశ్యులకు సంబంధించిన దేవాలయాల్లో రాజకీయ నాయకులకు ఎటువంటి ప్రమేయం ఉండకూడదన్నారు. ఆర్యవైశ్య కుల పెద్దల సమక్షంలో కానీ, ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో కానీ కమిటీని వేయాలని సూచించారు. ఇది వెంటనే అమలు చేయని పక్షంలో జనసేన పార్టీ తరఫున నిరసన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.

పోషకలోపాలను తొలగించేందుకే రాగిజావ

విశాలాంధ్ర-మంగళగిరి : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.86 కోట్లు వ్యయంతో రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నుంచి ప్రారంభించిందని ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని వీవర్స్ కాలనీ మున్సిపల్ హైస్కూల్‌లో మంగళవారం జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా జరిగిన రాగి జావ పంపిణీ కార్యక్రమానికి చిరంజీవి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థుల్లో పోషకలోపాలను తొలగించేందుకు సీఎం జగన్ రాగిజావ పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. మంగళగిరి మండల విద్యాశాఖ అధికారి జి.సత్యనారాయణ మాట్లాడుతూ వారంలో మూడు రోజులు ప్రతి విద్యార్థికి 150 ఎంఎల్ పరిమాణం కలిగిన రాగిజావను పంపిణీ చేస్తారన్నారు. పాఠశాల కమిటీ చైర్మన్ జి.రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు బలమైన ఆహారం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. హైస్కూల్ హెచ్ఎం సంగినేని శ్రీనివాసరావు, ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలు ఉషా లక్ష్మీ, భాగ్యలక్ష్మీ, సీఆర్పీ బేతపూడి ధనలక్ష్మీ పాల్గొన్నారు.

కొనసాగుతున్న కుట్టు మిషన్ల శిక్షణ

విశాలాంధ్ర-తాడేపల్లి : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సహకారంతో తాడేపల్లిలో ఏర్పాటు చేసిన మహిళలకు స్త్రీ శక్తి పేరుతో కుట్టు మిషన్లు స్వయం ఉపాధి శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కుట్టు మిషన్ల శిక్షణా తరగతులు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఈ శిక్షణా తరగతులలో మహిళలు ఉత్సాహంగా పాల్గొని శిక్షణ తీసుకుంటున్నారు. ఫిబ్రవరి నెలలో మొదలు పెట్టిన స్త్రీ శక్తి కేంద్రంలో మార్చి నెలతో మొదటి బ్యాచ్‌లో 60 మంది శిక్షణ పూర్తి చేసుకోనున్నారు.

సేవ్వో ఆర్గనైజేషన్‌కు ఉత్తమ సేవా పురస్కారం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : అక్షర ఫౌండేషన్ సూర్యాపేట ఆధ్వర్యంలో శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలలో భాగంగా అక్షర ఫౌండేషన్ పలు సామాజిక ఉత్తమ సేవలు అందించిన వారికీ అవార్డులను బహూకరించారు. దానిలో భాగంగా సేవ్వో చేస్తున్న రక్త దాతలు రక్షణ కోసం చేస్తున్న సేవ్వో ఎమర్జెన్సీ కార్డును గుర్తించి ఉత్తమ సామజిక సేవ అవార్డును అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వట్టే జానయ్య యాదవ్, జడ్పీ చైర్పర్సన్ గుజ్జ దీపిక, అక్షర ఫౌండేషన్ చైర్మన్ యాస రామ్ కుమార్‌రెడ్డి, ఉప్పు నాగయ్య, పాల్వాయి వెంకన్న, తిరుమల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన నల్లూరి వీర వెంకట సత్యన్నారాయణ S/o. పుల్లయ్య అనువారు IDBI Bank నుండు లోన్ తీసుకొనుటకు గాను దస్తావేజులు పరిశీలనకు లాయరు గారువద్దకు వంపగా సదరు దస్తావేజులలో క్రయ దస్తావేజు నెం. 1092/2018రు కొరిటెపాడు యస్.ఆర్.ఒ. నందు రిజిష్టరు పొంది మక్కపాటి సర్వదాత్రియ మరియు మక్కపాటి కిషన్‌చంద్ అనువార్ల పేర్ల తోను, క్రయ దస్తావేజు నెం. 5374/1985రుగా యస్.ఆర్.ఒ గుంటూరు ఆఫీసు నందు రిజిష్టరు పొంది చల్లపల్లి ఆంజనేయ రాధాగోపాలరావు అను వార్ల పేరుతో ఉన్న ఒరిజినల్ క్రయ దస్తావేజులు మరియు అకౌంట్ బుక్స్, వగైరాలు ది. 8.6.2021 తేదీన యక్కలి తిమ్మయ్యగారు తండ్రి సర్వయ్యగారు బ్యాగ్ సందు ఉంచుకొని శ్రీనివాసరావుతోట నుండి శ్యామలనగర్ వెళ్ళుటకు ఆటోలో ఎక్కి లాయరుగారి ఆఫీసుకు వెళ్ళి ఆటోదిగి చూసుగొనగా సదరు పై దస్తావేజులు మరియు ఇతర అకౌంట్స్ బుక్స్ పోగొట్టుకున్నట్లుగా తెలియపరుచుచు పేపర్ ప్రకటన ఇచ్చియున్నారు. సదరు ప్రకటనలో పై తెలిపిన దస్తావేజులు మరియు అకౌంట్స్ బుక్స్ దొరికినచో తిరిగి ఇవ్వమనికోరి ఉన్నారు.

సదరు పోయిన క్రయ దస్తావేజులు 1092/2018,5374/1985 పైఎవరికిఅయిన ఏవిధంగా ఆక్షేపణలు, అభ్యంతరాలు ఉన్న యెడల 7 రోజులలోపు తెలపగలరు. తదుపరి వచ్చు క్లెయిములు ఛార్జీలు వగైరాలు మా క్లయింటును బద్ధులను చేయజాలవని యావన్మందికి ఇందుమూలముగా తెలియజేయడమైనది.

యలమంచిలి రామకృష్ణ, అడ్వకేట్
రాధాకృష్ణ రెసిడెన్సి, ఆర్.టి.సి. కాలని, విజయవాడ

నీటిని కాపాడుకుంటేనే భవిష్యత్

విశాలాంధ్ర-గుంటూరు : కంటికి కనిపించని భూగర్భ జలాన్ని పది కాలాలపాటు కాపాడుకుంటేనే మానవ జాతికి భవిష్యత్ ఉంటుందని హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్(ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ) చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ ఎస్.శ్రీధర్ అన్నారు. విజ్ఞాన్స్ యూని వర్సిటీలోని ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ ఫోరమ్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ, స్కూల్ ఆఫ్ అప్లైడ్ సైన్స్ అండ్ హ్యూమానిటీస్ డిపార్ట్‌మెంట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం వరల్డ్ వాటర్ డేను పురస్కరించుకుని 'వాటర్ ప్యూరిఫికేషన్ అండ్ వేస్ట్ వాటర్ మేనేజ్‌మెంట్ త్రూ ఇన్నోవేటివ్ సైన్స్ అండ్ టెక్నాలజీ' అనే అంశంపై జాతీయస్థాయి సింపోసిజమ్ ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని 'యాక్సలరేటింగ్ చేంజ్ టు సాల్వ్ ద వాటర్ అండ్ సానిటేషన్ క్రైసిస్' అనే ఇతివృత్తంతో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ ఎస్.శ్రీధర్ మాట్లాడుతూ ప్రకృతి ప్రసాదిత జలానికి ప్రత్యామ్నాయం లేదన్నారు. ఈ అమూల్యమైన సహజ వనరును పరిరక్షించుకుంటూ పొదుపుగా, సమర్థంగా వాడుకుంటేనే జల సంక్షోభాలను ఎదుర్కోగలమన్నారు. ప్రస్తుత నీటి లభ్యత, వర్షపాతాల పరిస్థితులనుబట్టి చూస్తే భవిష్యత్‌లో తీవ్ర కొరత ఎదురు కావడం ఖాయంగా కనిపిస్తోందన్నారు. ఇప్పటినుంచైనా వర్షపు నీటిని ఒడిసిపట్టాలని, భూగర్భం నుంచి తీసుకునే నీటికి రెట్టింపు జలాన్ని నేలలోకి ఇంకించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. దీనికోసం ఇంకుడు గుంతలు, బోరు రీచార్జ్ ఛాంబర్లు, పంట కుంటల నిర్మాణాన్ని ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ ఫోరమ్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ, స్కూల్ ఆఫ్ అప్లైడ్ సైన్స్ అండ్ హ్యూమానిటీస్ డిపార్ట్‌మెంట్‌ల డీన్లు, విభాగాధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సులో ఎస్ఆర్ఎం విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-మంగళగిరి : వియత్నాం దేశంలోని బ్రిటీష్ యూనివర్సిటీలో మార్చి 11 నుంచి 14 వరకూ ఇంటర్నేషనల్ మోడల్ యునైటెడ్ నేషన్స్ (ఐఎంయూఎన్) నిర్వహించిన అంతర్జాతీయ సద స్సులో ఏపీ ఎస్ఆర్ఎం విద్యార్థులు అద్భుతమైన ప్రతిభను కనబరిచారు. సమకాలీన సామాజిక అంశాలపై వివరణాత్మకమైన డ్రాఫ్ట్ కాపీలను తయారు చేసి నిర్వాహకులకు అబ్బురపరిచారు. అంతేకాకుండా వివిధ దేశాల నుంచి హాజరైన పలు యూనివర్సిటీల విద్యార్థులతో కలిసి బృంద చర్చల్లో పాల్గొని తమ సత్తా చాటారు. బీఎస్సీ కంప్యూటర్స్ విద్యనభ్యసిస్తోన్న దుర్గాప్రవీణ్, ఇంజనీరింగ్ విద్యార్థులు వేణుగోపాల్, సాత్విక్ సుహాస్లు బెస్ట్ కామెంటేటర్స్‌గా ఎంపికై అంతర్జాతీయ వేదికపై భారత్ గొప్పదనాన్ని చాటిచెప్పారు. బ్రిటీష్ యూనివర్సిటీలో యునిసెఫ్, యూఎన్వో, యూఎన్ ఉమెన్ల సహకారంతో ఐఎంయూఎన్ సంస్థ అంతర్జాతీయ సదస్సును నిర్వహించింది. నాలుగు రోజుల పాటు జరిగిన ఈ సదస్సులో 35 దేశాలకు చెందిన యూనివర్సిటీల విద్యార్థులు పాల్గొన్నారు. ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ నుంచి దుర్గా ప్రవీణ్, ఇషిత, సహన, నవ్య, ప్రవీణ్ కుమార్, వేణుగోపాల్, సాత్విక్ సుహాస్, నితీష్, రమీజ్, సాత్విక్ సాయిలు హాజరయ్యారు. వివిధ దేశాల నుంచి హాజరైన మిగతా విద్యార్థులతో కలిసి వీరు కేన్సర్ చికిత్స, మానసిక ఆరోగ్య సమస్యలు, బాల్య వివాహాలు వంటి సామాజిక సమస్యలు, వాటి పరిష్కారాలపై వివరాలతో కూడిన నివేదికను సమర్పించారు. వీటిని పరిగణిస్తూ విద్యార్థులను వేదికపైకి ఆహ్వానించి ప్రశంసాపత్రాలను అందజేశారు. అంతర్జాతీయ సదస్సులో ఏపీ ఎస్ఆర్ఎం వర్సిటీ వాణిని వినిపించిన విద్యార్థులను యూనివర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ సత్యనారాయణన్, వైస్ ఛాన్సలర్ డాక్టర్ మనోజ్‌కుమార్ అరోరా, ఇంటర్నేషనల్ రిలేషన్స్ అండ్ హయ్యర్ స్టడీస్ డైరెక్టర్ పసుపులేటి నాగశ్వేత తదితరులు ప్రశంసించారు. సీనియర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ సామల సందీప్ విద్యార్థులకు సహకారం అందించారు.

ప్రజలకు ఉత్తమ సేవలు ప్రశంసనీయం

విశాలాంధ్ర-ఫిరంగిపురం: మండల ప్రజలకు పని వేళల్లో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి ఎన్నో సేవా కార్యక్రమాలు అందించడం ప్రశంసనీయమని మండంలో పలు పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులు, ప్రజలు మంగళవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపి డివో దాసరి అనురాధ, మండలంలోని వేమవరం గ్రామానికి చెందిన మున్నంగి శివకుమారి, ఇదే గ్రామానికి చెందిన పంచాయతీ కార్యదర్శి జి.వి.ఆర్.కె.మూర్తి, అదేవిధంగా గుండాలపాడు గ్రామ ఇంజనీర్ అసిస్టెంట్ గోపికృష్ణ, గొల్లపాలెం గ్రామ సచివాలయ సెక్రటరి కోటేశ్వరావు నాయక్, అలాగే మునగపాడు గ్రామానికి చెందిన వాలంటీర్ షేక్.నూర్ మున్నీసా, బేతపూడికి చెందిన క్లాప్ మిత్ర షేక్. మహమ్మద్ అనీఫ్‌లకు జిల్లా పరిషత్ చైర్మన్ కత్తెర హెనీ క్రిస్టీనా చేతులు మీదుగా జగనన్న స్వచ్ఛ సంకల్పం గ్రామీణ ఘన వ్యర్థాల నిర్వహణ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించినందుకు గుర్తింపుగా ఉత్తమ సేవా పురస్కారాలు చైర్మన్ చేతులు మీదుగా అందుకోవడం అభినందనీయమని హర్షం వ్యక్తం చేశారు.

యోగా మహోత్సవం విజయవంతం



విశాలాంధ్ర-తెనాలి : మంగళవారం తెనాలి తాలూకా హైస్కూల్ ప్రాంగణంలో శ్రీరామచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో యోగా మహోత్సవం తెనాలిలో విజయవంతంగా నిర్వహించారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మూడు రోజులపాటు చేపట్టిన ఈ కార్యాక్రమానికి ముఖ్య అతిధిగా తెనాలి శాసన సభ్యులు అన్నాబత్తుని శివకుమార్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ యోగా, ధ్యానం అందరూ నేర్చుకోవాలని, యోగా చేయడం వలన ఒత్తిడి, భయం, శారీరక, మానసిక ఆరోగ్యాన్ని యోగా ద్వారా పెంపొందిచుకోవచ్చని అన్నారు. ఈ గ్లోబలైజేషన్‌లో అరచేతిలో ప్రపంచాన్ని చూస్తున్న తరుణంలో 18 సంవత్సరాలు దాటిన పిల్లలందరికీ కూడా యోగ, ఆధ్యాత్మిక చింతన, మానసిక వికాసాన్ని పెంపొందిచే ప్రాంతాలకు తీసుకువెళ్ళాలని తల్లిదండ్రులను కోరారు. జీవితంలో కష్టనష్టాలు సుఖాలు, బాధ్యతలు, వృత్తి, ఉద్యోగాలలో నలిగిపోయి అనుభవం గడించిన తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వారికి విలువలు కలిగిన జీవితం అందించే విధంగా ఉండాలని పేర్కొన్నారు. శ్రీరామకోటేశ్వరరావు ఎమ్మెల్యే శివకుమార్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సభలో 120 మంది ప్రజలు పాల్గొని విజయవంతం చేశారు.

విశాలాంధ్ర
పల్నాడు జిల్లా

వైసీపీ నుంచి జనసేనలోకి 15 కుటుంబాలు చేరిక

విశాలాంధ్ర-వినుకొండ: దశ-దిశా లేని పాలనతో రాష్ట్రాన్ని అస్తవ్యస్తంగా జగన్మోహన్ రెడ్డి మార్చేశారని, అప్పుల ఊబిలో కూరుకుపోయిన ఆంధ్రప్రదేశ్‌ను కాపాడే శక్తి ఒక్క పవన్ కళ్యాణ్‌కు మాత్రమే ఉందని, ఆ నమ్మకంతోనే వినుకొండ నియోజవర్గ జనసేన పార్టీలోకి భారీగా చేరుతున్నారని నియోజకవర్గ నాయకుడు, జిల్లా కార్యదర్శి నీశంకర్రావు శ్రీనివాస్ అన్నారు. బొల్లాపల్లి మండలం గండిగనుమల గ్రామంలో అధికార వైసీపీ నుంచి జనసేన పార్టీ లోకి 15 కుటుంబాలు చేరారు.. వీరిని పార్టీ కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు. రానున్న రోజుల్లో జనసేన పారీలోకి మరిన్ని చేరికలు ఉంటాయని శ్రీనివాస్ అన్నారు. అధికార పార్టీ చేస్తున్న అరాచకాలపై పోరాడుతున్న ఏకైక పార్టీ జనసేన మాత్రమేనని అన్నారు. జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ చేస్తున్న ప్రజా పోరాటాలు నచ్చి, రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపించే శక్తి ఆయనకు మాత్రమే ఉందనే నమ్మకంతో పార్టీలో చేరామని వారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు రాగిజావ దోహదం

విశాలాంధ్ర-శావల్యాపురం : ప్రభుత్వ పాఠశాలల్లో వినూత్న సంస్కరణలు చేపట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేడు విద్యార్థులలో రక్తహీనత నివారణకు రాగిజావతో మరో వినూత్న పథకానికి శ్రీకారం చుట్టారని ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్ కుమార్ అన్నారు. మండలంలోని వేల్పూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాగిజావను ఎంపీపీ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాగి జావతో విద్యార్థులలో రక్తహీనత, పోషకాల లోపాలను నివారించవచ్చని తెలిపారు. రాగిజావను తీసుకోవడం వల్ల ఆరోగ్యాపరంగా అనేక లాభాలు చేకూరతాయని తెలిపారు. సొసైటీ చైర్మన్ నాగులపాటి చెన్నయ్య మాట్లాడుతూ జగనన్న గోరుముద్దతో రుచికరంగా అందించటమే కాకుండా రాగిజావ వారానికి మూడు రోజులు అందించే విదంగా మెనులో చేర్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం జంగాల అనిత, పీఎంసీ చైర్మన్ పల్లపాటి శ్రీనివాస రావు, గ్రామస్తులు నాగులపాటి శ్రీనివాసరావు, దావులూరి ఏడుకొండలు, సూరాబత్తుని కృష్ణారావు, ఉపాధ్యాయులు పారెళ్ళ గురుబాబు, కోటేశ్వరరావు, శివ నాగేశ్వరరావు, యరియదాసు, శివరామకృష్ణ, ముప్పాళ్ళ కృష్ణ, రత్నలత, సునిత, హరీష, పీడీ సుబ్బారావు, అసిస్టెంట్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దేవత విగ్రహాల ధ్వంసం

విశాలాంధ్ర-వినుకొండ: ఏనుగుపాలెం రోడ్డులో ఉన్న అంకాలమ్మ తల్లి ఆలయంలో నవ దేవత విగ్రహాలను పాక్షికంగా ధ్వంసం చేశారు. ఆలయం పునర్నిర్మాణంలో భాగంగా ఆలయ లోపల భాగంలో చుట్టూ నవ దేవత విగ్రహాలను నిర్మించారు. అయితే నిర్మాణంలో ఉన్న ఆయాలంలో ఆదివారం రాత్రి అంకాలమ్మ పేటలోని గుర్తుతెలియని వ్యక్తులు ఈ ఘాతుకానికి పాల్పడ్డారని ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షులు నల్లూరి కోటేశ్వరరావు తెలిపారు. అలానే సంఘటన గురించి తెలుసుకున్న దేవాదాయ శాఖ అధికారులు పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు ఇవ్వగా పోలీసు వారు సీసీటీవీల ద్వారా విగ్రహాలను ధ్వంసం చేసిన వ్యక్తులను గుర్తిస్తారని వారు తెలిపారు. ఇటువంటి దుర్ఘటనకు పాల్పడ్డ వారిపై కఠినంగా శిక్షించాలని కమిటీ సభ్యులతో పాటు స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్ నివారణకు చర్యలు

విశాలాంధ్ర-దుర్గి : ట్రాఫిక్ నివారణకు ఎస్సై కె.సతీష్ చర్యలు తీసుకున్నారు. మంగళవారం ఆయన తమ సిబ్బందితో దుర్గి బస్టాండ్ సెంటర్‌కు విచ్చేశారు. గతంలో పోలీసులు ఇచ్చిన మార్జిన్ దాటి వచ్చిన వ్యాపారులను పిలిచి మార్జిన్ అవతల పెట్టుకోవాలని, అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. బస్టాండ్ సెంటర్లో ఇరువైపుల నో-పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేశారు. అతిక్రమిస్తే రూ.500లు జరిమాన విధిస్తారన్నారు. మాచర్ల ఆర్టీసీ డిపో మేనేజర్ పిచ్చయ్యతో ఫోన్లో మాట్లాడి దుర్గికీ రావాలని కోరారు. దుర్గిలో బస్టాండ్ ప్రాంతాన్ని డిపో మేనేజర్ ఎస్సైతో కలిసి పరిశీలించారు. బస్టాండ్ సెంటర్లో రోడ్డుకు ఇరువైపుల దాతలు ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బస్ షెల్టర్లను డిపో మేనేజర్‌కు ఎస్సై చూపించి బస్సులు అక్కడ ఆపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. బస్ షెల్టర్ల వద్ద ద్విచక్ర వాహనాలు, ఆటోలు అడ్డులేకుండా చూస్తే బస్సులు షెల్టర్ల వద్దే ఆపాలని డ్రైవర్లకు ఆదేశాలు జారీ చేస్తానని ఆయన ఎస్సైకు చెప్పారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

విశాలాంధ్ర-కారంపూడి: పట్టణంలోని ఎస్సీకాలనీలో నూతనంగా సీసీ రోడ్డు వేయుటకు జడ్పీటీసీ షేక్ షఫి మంగళవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ కాలనీలో సిసిరోడ్డు వేసేందుకు జడ్పి నిధులు రూ.5 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శారదాశ్రీనివాసరెడ్డి, సర్పంచ్ ప్రమీలాతేజానాయక్, కోఆప్షన్ సభ్యుడు అంతరగడ్డ ఏసోబు, ఎంపిటిసి ఆరీఫ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు రాగిజావ పంపిణీ

విశాలాంధ్ర-కారంపూడి: పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న జగనన్న గోరుముద్ద పథకంలో రాగిజావను అదనంగా అందించే కార్యక్రమాన్ని మంగళవారం జడ్పిటిసి షేక్ షఫి ప్రారంభించారు. మండలంలోని బిజడ్పిహెచ్ఎస్ పాఠశాల, ఉర్దూ పాఠశాల, పెద్దకొదమగుండ్లలోని జడ్పి పాఠశాలల్లో విద్యార్థులకు రాగిజావను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పాఠశాల హెచ్‌ఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తకపఠనంతో విజ్ఞానసముపార్జన

విశాలాంధ్ర-కారంపూడి: విద్యార్థులు పుస్తకాలు చదవడం ద్వారా జ్ఞానాన్ని సంపాదించుకోవచ్చని ప్రవాస భారతీయ వాసవి సంఘం అధ్యక్షులు పందిరి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఎపి ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల బాలుర, బాలికల పాఠశాలలో పుస్తకమిత్ర కార్యక్రమం ద్వారా సుమారు 1500 పుస్తకాలను ఆయన అందజేశారు. పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు సిఎ ప్రసాద్, జి.వేణుగోపాలరావు, లక్ష్మీనారాయణ, బాలగురవయ్య, లక్ష్మీచెన్నకేశవ, పి.కోటేశ్వరరావు, డి.మనోహర్, బి.మాన్‌సింగ్‌నాయక్, హెచ్ఎంలు వేణుగోపాల్, శివరామకృష్ణ పాల్గొన్నారు.

నిరుపేద ముస్లిం వితంతువులకు చేయూత

విశాలాంధ్ర-చిలకలూరిపేట: పవిత్ర రంజాన్ వంటి పర్వదినాల్లో నిరుపేద మహిళలను భాగస్వాములను చేయాలని అసిస్ట్ సేవా సంస్థ డైరెక్టర్ జాప్తి రంగారావు చెప్పారు. అసిస్ట్, కేఎస్ఏ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని 160 మంది ముస్లిం వితంతువులకు నిత్యావసరాలు, చీరెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ సందర్భంగా ముస్లింలు నెల రోజుల పాటు ఎంతో కఠినమైన ఉపవాసదీక్షలు చేపడతారని వెల్లడించారు. పండుగ మాసంలో నిరుపేద వితంతు ముస్లిం మహిళలు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. సంస్థ ఆపరేషనల్ డైరెక్టర్ జాప్తి కృష్ణహరీష్ మాట్లాడుతూ ఒక్కొక్కరికి రూ. 5వేల విలువైన వస్తువులు, దుస్తులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మాసాన్ని ఎంతో భక్తి భావంతో పాటించాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

రాగిజావ పంపిణీ

విశాలాంధ్ర-రెంటచింతల: జగనన్న గోరుముద్దలో భాగంగా ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వారానికి 15 వెరైటీలు, ఐదు రోజుల పాటు గుడ్డు, 3 రోజులు చిక్కినేటి నుండి వారంలో 3 రోజుల పాటు ఉదయం పూట రాగిజావ పంపిణీ చేస్తునట్లు ఎంఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ రాగి జావ అందించడం ద్వారా విద్యార్థుల్లో ఐరన్, క్యాల్షియం లోపం రాకుండా ముందుగానే నివారించవచ్చని, విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో రాగిజావ పంపిణీ పథకం మండలంలో 36 పాఠశాలలో మంగళవారం ప్రారంభించినట్లు ఎంఈఓ తెలిపారు. ఈ పథకంలో భాగంగా మండలంలో 4216 మంది బాల బాలికలకు పౌష్టికాహారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ కె పుల్లారావు, ఈఓఆర్డీ రామచంద్రరావు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సబ్ జైలు ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-వినుకొండ: జూనియర్ సివిల్ జడ్జి ఎ.తౌషిద్ హుస్సేన్ వినుకొండ సబ్ జైలును ఆకస్మిక తనిఖీ చేశారు. ఖైదీలతో సమావేశం నిర్వహించి వారి ఆరోగ్య పరిస్థితులను, జైలులో అందిస్తున్న భోజన సదుపాయాలు గురించి అడిగి తెలుసుకున్నారు. జైలులో ఏమైనా ఇబ్బందులు ఉంటే తెలియజేయాలన్నారు, జైలులో అందిస్తున్న మెనూను పరిశీలించారు. వైద్యం, భోజనం తదితర విషయాల గురించి ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. జైల్ నుంచి విడదల అయిన తరువాత సత్ప్రవర్తన కలిగి ఉండాలని, నేరాలకు దూరంగా ఉండాలని, సమాజంలో మంచి పౌరులుగా జీవించాలని తెలిపారు, న్యాయవాదిని ఏర్పాటు చేసుకోలేని వారికి న్యాయవాదిని నియమిస్తామని, ఎవరికైనా న్యాయ సహాయం కావాలంటే తెలియజేయాలని తెలిపారు, ఖైదీలకు ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలన్నారు. అనంతరం జైలు గార్డెన్‌ను పరిశీలించారు. జైలు ప్రాంగణమును పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అరే సామ్రాజ్యం, కే చెన్నకేశవరెడ్డి, పి.సైదారావు, భాను తేజ, వై.శ్రీనివాసరావు, రామాంజనేయ రెడ్డి, గోపానాయక్, పోలీసులు, జైలు సూపరింటెండెంట్ మధుసూదన్ రావు, కోర్టు సిబ్బంది, లోక్ అదాలత్ సిబ్బంది, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు రాగిజావ పంపిణీ

విశాలాంధ్ర-వినుకొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థుల కోసం జగనన్న గోరుముద్ద కార్యక్రమాన్ని ఇదివరకే ప్రారంభించారు అయితే మంగళవారం నుండి విద్యార్థులకు ప్రత్యేకంగా రాగి మాల్టను అందజేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా వినుకొండ మండల విద్యాశాఖ అధికారి సయ్యద్ జఫరుల్లా పట్టణంలో గల హనుమాన్ నగర్ పాఠశాల నందు ఈ రాగి జావ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి వినుకొండ మునిసిపల్ చైర్మన్ దస్తగిరి షకీలా, 29వ వార్డు కౌన్సిలర్ పి.మల్లికా బేగం, పీఎస్ ఖాన్, 27వ వార్డు కౌన్సిలర్ అయిల పోగు హేమలత, కిన్నెర కళ్యాణ్, టౌన్ యూత్ ప్రెసిడెంట్ అత్తర్ నాగూర్ వలి విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు. అనంతరం చైర్మన్ దస్తగిరి షకీలా చిన్నారులకు రాగి జావను అందజేసి దానిలోని పోషక విలువల గురించి విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గౌస్ బాషాకు సన్మానం

విశాలాంధ్ర-వినుకొండ: వినుకొండ పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెసు పార్టీ కార్యాలయంలో వినుకొండ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మ నాయుడు సహాయ సహకారాలతో పల్నాడు జిల్లా వక్ఫ్ బోర్డ్ మెంబర్‌గా నియమితులైన హాఫిజ్ అద్దంకి గౌస్ బాషా సన్మానించి బొల్లా బ్రహ్మనాయుడు అభినందనలు తెలియజేశారు. నియోజకవర్గ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రాగిజావ పంపిణీ

విశాలాంధ్ర - నకరికల్లు : మండల కేంద్రమైన నకరికల్లులోని ఎంపీపీఎస్ స్కూల్ నందు మంగళవారం రాగిజావ పంపిణీ కార్యక్రమం జరిగింది. జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో భాగంగా నూతనంగా ప్రవేశపెట్టిన రాగిజావ పంపిణీ కార్యక్రమంలో విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రాగిజావ త్రాగడం వలన విద్యార్థులకు మంచి పోషకాలు లభిస్తాయన్నారు. విద్యార్థులకు వారంలో మూడు రోజులు రాగిజావను అందించడం జరుగుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-దుర్గి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకం క్రింద నాణ్యమైన ఆహారంతో పాటు రాగిజావ అందించడం ద్వారా విద్యార్థుల్లో ఐరన్, క్యాల్షియం లోపం రాకుండా ముందుగానే నివారించ వచ్చునని ఎంపిపి యేచూరి సునీత సాయిశంకర్, సర్పంచ్ తోటకూర వెంకటనర్సమ్మనాగేశ్వరావు, ఎంపిటిసి పసుపులేటి వెంకట్రామయ్యలు అన్నారు. మండల పరిధిలోని ముటుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు మంగళవారం ఏర్పాటు చేసిన విద్యార్థులకు రాగిజావ పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో యార్డు చైర్మన్ వెలిదండి గోపాల్, సర్పంచ్ చాట్ల శాంతరమేష్, ఎంపిటిసి కటకం గోపాల్, ఎంఈఓ అల్లిసురేష్, మండల యూత్ కన్వీనర్ యకటీల బుచ్చిబాబు, కటకం చినవెంకటయ్య, చెన్నుపాటి సీతారామయ్యలు విచ్చేశారు. వైసీపీ మండల ప్రచార కమిటీ కన్వీనర్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ తోటకూర వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయులు పోలా మల్లిఖార్జునరావు విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు.

ఏఎన్ఎమ్, ఆశా కార్యకర్తలు సక్రమంగా పనిచేయాలి

విశాలాంధ్ర-పెదకూరపాడు రూరల్: ఏన్ఎంఎం, ఆశా కార్యకర్తలు సక్రమంగా పని చేయాలని జిల్లా వైద్య అధికారి శోభా రాణి ఆదేశించారు. మండల పరిధిలోని75 తాళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య అధికారి మాట్లాడుతూ మండలంలోని 20 గ్రామాలలో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఎప్పటికప్పుడు ప్రజల ఆరోగ్యంపై దృష్టి సారించి తెలుసుకుంటూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. గ్రామాలలో అంగన్వాడి, ప్రజా ప్రతినిధులతో కలసి సర్వే నిర్వహించేటప్పుడు మురుగు కాలవలు పరిశుభ్రతపై దోమ కాటుపై గర్భిణీ స్త్రీలు, బాలింతలకు సూచనలు సలహాలు ఇవ్వాల్సిన బాధ్యత మీపై ఉందని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుని నిపుణులు డాక్టర్ ప్రియంక, వెంగల్ రెడ్డి, విజయకుమార్ సూపర్వైజర్ దిలీప్ శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

జగన్ పాలనకు త్వరలో చరమగీతం : జీవీ

విశాలాంధ్ర-నూజెండ్ల: రాష్ట్రంలో జగన్ రెడ్డి అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పాడేందుకు సిద్ధంగా ఉన్నారని, ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో టీడీపీ విజయమే అందుకు నిదర్శనమని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. నూజెండ్ల మండలం కంభంపాడు గ్రామంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మీసాల మురళీకృష్ణ అధ్యక్షతన గ్రామ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో జరిగిన "రాష్ట్రానికి ఇదేమి ఖర్మ" కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వైసిపి పాలనలో జరుగుతున్న అరాచకాలను ఎండగడుతూ ప్రతి ఇంటికి తిరిగి వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అంటూ జగన్ రెడ్డి మరోవైపు అనేక పన్నులు విధించి ప్రజలపై పెనుభారం మోపి రాష్ట్రాన్ని దోచుకున్నాడని విమర్శించారు. నిత్యవసరాలు సరుకులు ధరలు పెరిగి పేద మధ్యతరగతి కుటుంబాలు జీవన మనుగడ కష్టతరంగా మారితే నియంత్రించాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తుందన్నారు. కార్యక్రమంలో మండల, గ్రామ నాయకులు గంగినేని రామారావు, వాసి రెడ్డి శ్రీను, గంగినేని చంద్రశేఖర్, గంగినేని వెంకటేశ్వర్లు, మేదరమెట్ల అనీల్, వెంకట్రావు, వంకాయలపాటి పేరయ్య, ముంద్రు సుబ్బారావు, గంగినేని ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-పెదకూరపాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం చలివేంద్రాన్ని తహసీల్దార్ క్షమారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవికాలంలో కార్యాలయానికి వచ్చే ప్రజలకు దాహాన్ని తీర్చేందుకు ఈ చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఒక్కరు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకొని దాహాన్ని తీర్చుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ నిర్మలకృష్ణ, కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ, అభిమానం కలిగి ఉండాలి

విశాలాంధ్ర-శావల్యాపురం: ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల పట్ల ప్రేమ, అభిమానం కలిగి ఉండాలని ఏంఈఓ మద్దికుంట సాంబశివరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రంలో అంతర్జాతీయ డౌన్ సిండ్రోమ్ డే సందర్భంగా కేక్ కట్ చేసి విద్యార్థులకు అందజేసి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జన్యు లోపం, మేనరికాల వలన తలకాయ లావుగా జన్మించే చిన్నారులను, డౌన్ సిండ్రోమ్ చిన్నారులంటారని తెలిపారు. ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు చేపడుతున్నదని, వాటిని సద్వినియోగం చేసుకో వాలన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల అభివద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారాన్ని అందించాలని కోరారు. ఎస్టీయూ మండల అధ్యక్షులు బిల్లా రాజా రమేష్, ఐఈఆర్టి కో-ఆర్డినేటర్ జగన్మోహన్ రెడ్డి, టీచర్స్ నరసింహ శాస్త్రి, శ్రీహరి, సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లల సర్వతోముఖాభివృద్ధికి చర్యలు

విశాలాంధ్ర-నూజెండ్ల : జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పిల్లల సర్వతోముఖాభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటుందని సర్పంచ్ కంచర్ల కోటేశ్వరమ్మ బాబు అన్నారు. మండలంలోని ములకలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు శ్రీలతాదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి సర్పంచ్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ సూరాబత్తిన అజిత వీరయ్య ముఖ్యఅతిథిలుగా హాజరయ్యారు. మంగళవారం గోరుముద్ద పథకంలో భాగంగా పిల్లలకు రాగి జావను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ గోరుముద్ద ద్వారా బలవర్ధకమైన పౌష్టికాహారంను ప్రభుత్వం అందిస్తోందని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి స్వయంగా ఆయనే మెనూను రూపొందించారని అన్నారు. ఐరన్, కాల్షియం వంటి పోషకాలు అందించి విద్యార్థుల్లో రక్తహీనత, పోషకాల లోపాన్ని నివారించేందుకు వారానికి మూడు రోజులు (మంగళ, గురు, శని) బెల్లంతో కూడిన రాగిజావను ఇస్తారని, జగనన్న గోరుముద్దలో భాగంగా ఇప్పటికే వారానికి 15 వెరైటీలు, ఐదు రోజుల పాటు గుడ్డు, 3 రోజులు చిక్కీతో పాటుగా నేటి నుంచి 3 రోజులు రాగిజావ కూడా మెనూలో ఉంటుందని తెలిపారు. తమ తండ్రి కంచర్ల పెద సుబ్బారావు జ్ఞాపకార్థం విద్యార్థులందరకి స్టీల్ గ్లాసులను అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్‌లో బాలికల జట్టుకు తృతీయ స్థానం

విశాలాంధ్ర-శావల్యాపురం : జూనియర్(అండర్ 19) 7వ బాలికల బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయి పోటీలలో ఉమ్మడి గుంటూరు జిల్లా బాలికల జట్టు తృతీయ స్థానం సాధించారని శావల్యాపురం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాలాది శ్రీనివాసరావు తెలిపారు. పాఠశాలలో వారికి అభినందన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా శావల్యాపురం ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్ కుమార్, సొసైటీ చైర్మన్ నాగులపాటి చెన్నయ్య పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు క్రీడల్లో రాణించాలని, ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, క్రీడల కోటాలో ఐఐటీ, ట్రిపుల్ ఐఐటీ, మెడిసిన్ సిట్లు సాధించటమే కాకుండా ఉద్యోగాలు సాధించిన వారు చాలామంది ఉన్నారని తెలిపారు. సొసైటీ చైర్మన్ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలోనే బాలికలు ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ తదితర క్రీడల్లో రాణించడం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో గొప్ప క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం క్రీడాకారులకు అవసరమైన బ్యాడ్మింటన్ బ్యాట్లు రవాణా ఖర్చులు అందించిన ఎంపీపీ, సొసైటీ చైర్మన్‌లను దృశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మద్దికుంట సాంబశివరావు, బీవీ నాగేశ్వరరావు, భువనేశ్వరి, కిషోర్, అబ్దుల్లా, నిర్మల, కోటేశ్వరరావు, రవి, హలీమా, హబీ, శ్రీకాంత్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాము మృతితో గ్రామంలో విషాదం

విశాలాంధ్ర-యడ్లపాడు : మండలంలోని లింగారావు పాలెం గ్రామానికి చెందిన మురుకుట్ల రాము(55) సోమవారం రోడ్డు ప్రమాదంలో మరణించాడు. మంగళవారం రాము మృతదేహానికి గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఇటీవల సత్తెనపల్లి వద్ద నిర్మించిన కోల్డ్ స్టోరేజ్ నుంచి తిరిగి గ్రామానికి వస్తుండగా సోమవారం సాయంత్రం సాతులూరు గ్రామం వద్ద రైల్వే గేట్ పడిపోయి గంటకు పైగా ట్రాఫిక్ ఆగిపోయినట్లు సమాచారం. దాంతో ట్రాఫిక్ దిగ్బంధనం నుంచి వెనుకకు మరలి సత్తెనపల్లి వెళుతుండగా మాదల గ్రామం వద్ద రాము కారు అదుపుతప్పి పంట పొలాల్లోకి బోల్తా కొట్టినట్లు రాము బంధువులు చెప్తున్నారు. సంఘటనా స్థలంలోనే మరణించిన రాము మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం మంగళవారం లింగారావుపాలెం గ్రామానికి తీసుకువచ్చి కుటుంబ సభ్యులు అంత్యక్రియలు చేశారు. మృతునికి భార్య, వివాహమైన ఇరువురు కుమారులు కలరు.

మండలంలో రాగి జావ పంపిణీ ప్రారంభం

విశాలాంధ్ర-వెల్దుర్తి: ప్రభుత్వం విద్యార్థుల కోసం అమలు చేస్తున్న రాగిజావ పంపిణీ కార్యక్రమం ఎంపీడీవో ప్రసాదరావు, ఎస్సై శ్రీహరి, డిటి బ్రహ్మయ్య చేతుల మీదుగా మండలంలో ప్రారంభమైంది. పంపిణీలో భాగంగా మండల పరిధిలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో కస్తూరిబా మోడల్ స్కూల్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో మొత్తం 52 స్కూళ్లలో సుమారు 6000 మంది విద్యార్థులకు రాగి జావా పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పాల్గొన్న అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని వారికి రాగి జావతో పాటు పౌష్టికాహారాన్ని అందిస్తూ ఎంతో మేలు చేస్తోందని తెలిపారు. ప్రతి విద్యార్థి ప్రభుత్వం అందించే ఆహార పదార్థాలను తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పులుసు నారాయణరెడ్డి, ఎస్ఆర్పి పూర్ణ, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-రొంపిచర్ల: మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం విద్యార్థులకు రాగిజావ పంపిణీ కార్యక్రమం జరిగింది. జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో భాగంగా విద్యార్థులల్లోరక్తహీనతనివారణకు రాగిజావ పంపిణీ కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఉపాధ్యాయులు తెలిపారు. మండలంలో బుచ్చిపాపన్నపాలెం గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాగిజావ పంపిణీ ప్రారంభోత్సవం సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ గజ్జల ముసలారెడ్డి 150 గ్లాసులు పంపిణీ చేశారు. అదే విధంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, స్థానిక బొడ్రాయిసెంటర్లో గల ఎంపిపి (న్యూ) స్కూల్ లో, మండలంలో అన్ని గ్రామాల్లో గల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు షేక్ మొహిద్దీన్ సాహెబ్, జి.అమరనాథ్, కోటేశ్వరమ్మ, పేరెంట్స్ కమిటీ చైర్మన్లు తవనం రామిరెడ్డి, సాధం హుస్సేనయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాల దిశగా పనిచేయాలి

విశాలాంధ్ర-దుర్గి: ఐక్యరాజ్య సమితి సూచించిన 17అంశాల సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన దిశగా అధికారులు పని చేయాలని ఎంపిపి ఏచూరి సునీత సాయి శంకర్ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపిపి అధ్యక్షతన ఎస్ డీజీ సర్వేపై పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా 17అంశాలు గురించి ఈసమావేశంలో వివరించారు. ఎస్ డీజీ సర్వే ట్రైనర్, మండల విద్యాశాఖాధికారి అల్లి సురేష్ మాట్లాడుతూ 0-5, 6-19పిల్లలు, ఎనీమియా, గర్భిణిలు సర్వే తక్కువగా ఉందని, సంబంధిత శాఖల అధికారులు త్వరగా వివరాలు సేకరించాలని సూచించారు. అందరూ సమిష్టిగా పనిచేసి 2030కల్లా ఈసర్వే పూర్తి చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో ఈఓపీఆర్డి జీఎల్ఎన్ గుప్తా, డాక్టర్ లావణ్య, ప్రదానోపాధ్యాయులు, సిఆర్పిలు, ఎఎన్ఎంలు, ఆశాలు, డ్వాక్రా మహిళలు, వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బంది పాల్గొన్నారు.

వేలాడుతున్న విద్యుత్ తీగలు..

విశాలాంధ్ర-బెల్లంకొండ: ప్రతి నెల క్రమం తప్పకుండా విద్యుత్ బిల్లులు వసూలు చేసే అధికారులకు ప్రమాదాలకు నిలయంగా మారిన ప్రదే శాలు కనిపించటం లేదు. బెల్లంకొండ మండలంలోని మాచాయపాలెం గ్రామ శివారు ఆంజనేయస్వామి గుడి సమీపంలో విద్యుత్ తీగలకు కంప చెట్లు అల్లుకొని, విద్యుత్ తీగలు కిందికి జారిపోయి ఉండదంతో వ్యవసాయ పనులు చేసుకోవాలంటే ఆటంకం కలుగుతుందని రైతుల ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఎలాంటి ప్రమాదాలు జరగకముందే జిల్లా స్థాయి అధికారులు మండల స్థాయి అధికారులు తో పంట పొలాల్లోని ప్రమాదాలకు నిలయంగా ఉన్న విద్యుత్ తీగలను గుర్తించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుచున్నారు.

చెరువులో పడి యవకుడి మృతి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: పట్టణానికి తాగునీటిని సరఫరా చేసే మంచినీటి చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి ఓ యువకుడు పడి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని వైఎస్సార్ కాలనీకి చెందిన నల్లూరి అనిల్(30) మంగళవారం సాయంత్రం చేపలు పట్టేందుకు చెరువు వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తూ అందులో పడి గల్లంతయ్యాడు. అధికారులు హుటాహుటిన చెరువు వద్దకు చేరుకున్నారు. చెరువుకు సాగర్ జాలాలు వచ్చి చేరుతున్నాయి. విషయం తెలియగానే అధికారులు చెరువుకు నీరు పెట్టడం నిలిపివేశారు. చెరువు నిండా నీరు ఉండటంతో స్థానికంగా గాలింపు చర్యలకు ఇబ్బందిగా మారింది. రాత్రి సమయానికి అనిల్ మృతదేహం లభ్యమైంది. చిలకలూరిపేట రూరల్ ఎస్సై రాజేష్ ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టారు. మరో యువకుడితో కలసి అతను చేపల వేటకు వెళ్లినట్లు తెలిసింది. యువకుడికి వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. అతని బంధువులు, వైఎస్సార్ కాలనీ వాసులు పెద్ద ఎత్తున చెరువు వద్దకు చేరుకొని విలపిస్తున్నారు. చైర్మన్ షేక్ రఫాని, పలువురు కౌన్సిలర్లు గాలింపు చర్యలు పర్యవేక్షించారు.

నెమలి వాహనం బహుకరణ

విశాలాంధ్ర-శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామంలో వేంచేసియున్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఉత్సవ ఊరేగింపు కొరకు నెమలి వాహనాన్ని దాతలు బహుకరించినట్లు ఆలయ పూజారులు కొడవటిగంటి కృష్ణమాచార్యులు, రంగాచార్యులు మంగళవారం తెలిపారు. ఈసందర్భంగా అర్చకులు మాట్లాడుతూ బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం సజ్జాపురం గ్రామానికి చెందిన దూళిపాళ్ల వెంకటేశ్వర్లు భార్య పూర్ణమ్మ కుమారుడు శ్రీనివాసరావు, హేమలత దంపతులు నెమలి వాహనాన్ని ఆలయ ధర్మకర్తలు బొల్లా పేరయ్య, ఓట్ల నాగేశ్వరరావు అందజేశారన్నారు. రూ.75 వేల రూపాయల ఖర్చుతో ఈ నెమలి వాహనాన్ని తయారు చేయించి దేవాలయానికి అందించినట్లు కుటుంబ సభ్యులు తేలప్రోలు శేషారావు తెలిపారు.

రాగిజావ పంపిణీ

విశాలాంధ్ర-పెదకూరపాడు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఇచ్చే జగనన్న గోరు ముద్దలో భాగంగా రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని పెదకూరపాడు మండల పరిషత్ అధ్యక్షులు బెల్లంకొండ మీరయ్య మంగళవారం ప్రారంభించినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తహీనతను అరికట్టుటకు, కాల్షియంను, ఐరన్ కంటెంట్ పెంపొందించుటకు, విద్యార్థులు ఆరోగ్యంగా ఉండటానికి రాగిజావ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ప్రతిఒక్క విద్యార్థి పాఠశాలకు వచ్చిన వెంటనే రాగిజావను సేవించాలని తెలియ జేశారు. ప్రభుత్వం పాఠశాలల విద్యార్థులకు రాగిజావను అందించటం చాలా సంతోషకరమన్నారు. మండల విద్యాశాఖాదికారి ఏకుల ప్రసాద రావు, వైసీపీ సీనియర్ నాయకులు కాలువ అప్పారావు, ప్రదానోపాధ్యా యులు జి.వీరాంజనేయరావు, వ్యాయామ ఉపాధ్యాయులు పి.శరత్ బాబు, రాయపూడి సాంబశివరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజలకు జీవీ ఉగాది శుభాకాంక్షలు

విశాలాంధ్ర-వినుకొండ: ప్రజలందరూ సుఖసంతోషాలతో పాడిపంటలతో ఆయురారోగ్యాలతో ప్రజలందరూ బాగుండాలని ఆ భగవంతుణ్ణి కోరుకుంటున్నానని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు జి.వి.ఆంజనేయులు అన్నారు. 'శ్రీ శోభకృత్ నామ ఉగాది' సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు శాంతి, శ్రేయస్సు, సామరస్యం, సంతోషాన్ని కలిగించాలని పేర్కొన్నారు. నూతన సంవత్సరంలో సమృద్ధిగా వర్షాలు కురిసి వ్యవసాయ వృద్ధి జరగాలని, రైతులతో పాటు అన్ని వృత్తుల ప్రజలు ఆనందంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ ఉగాది పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని కోరుకుంటున్నాను అని తెలియజేశారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు **దేవరకొండ వెంకట్రావు,** S/o. ఆంజనేయులు, R/o. చెరుకుపల్లి గ్రామం, చెరుకుపల్లి మండలం, బాపట్ల జిల్లా అనువారి నుండి తగు సమాచారం పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

మా క్లయింటు ఆరుంబాక చెరుకుపల్లి గ్రామ సర్వే **నం. 68/4** నందు **169.12** చదరపు గజముల ఆస్తి యొక్క లింక్ దస్తావేజు చెరుకుపల్లి సబ్-రిజిస్ట్రార్ **నం.2214/2010 తేది.04.09.2010**ను ఫొటోస్టాట్ కాపీలు పొందుటకు తీసుకెళ్ళు క్రమములో పల్నాడు జిల్లా, గురజాల పట్టణంలోని కోర్టు సెంటర్ వద్ద **ది.28.02.2023**న పోగొట్టుకోవడ మైనది, మా క్లయింటు సదరు దస్తావేజును ఎంత వెతికిననూ దొరికియుండలేదు. కావున ఈ పబ్లిక్ నోటీసు ద్వారా యావన్మందికి తెలియజేయునది ఏమనగా సదరు పై చెప్పబడిన విక్రయ దస్తావేజు **నం. 2214/2010** ఎవరికైన దొరికిన యెడల నా క్లయింటును వారి మొబైల్ **(7989509220)** ద్వారా సంప్రదించికాని లేక ఈ క్రింది చిరునామాకు సంప్రదించి అయిన ఇవ్వవలసిందిగా కోరడమైనది.

సయ్యద్ మహమ్మద్ ఖాసీమ్, అడ్వకేట్,
కొత్తపేట, వినుకొండ.
సెల్: 9030214799.

విశాలాంధ్ర

బాపట్ల జిల్లా

రాగి జావతో పౌష్టికాహార లోప నివారణ

విశాలాంధ్ర-పర్చూరు: రాగి జావను సేవించట వలన విద్యార్థుల్లో రక్త హీనత, పౌష్టికాహార లోపనివారణకు దోహద పడుతుందని ఎంపీడీఓ లక్ష్మీదేవి తెలిపారు. స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా రాగిజావను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులకు గోరు ముద్దపై అవగాహన కలిగించాలని తెలిపారు. మండల విద్యాధికారి డి.నాగేశ్వరరావు మాట్లాడుతూ రాగిజావ వారంలో మూడు రోజులు ఉంటుందని, ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కొల్లా సుభాష్, మండల కోఆప్షన్ సభ్యులు హాలీవుడ్ కాలేషావలి, కాంప్లెక్స్ చైర్మన్ ఈదర రాజశేఖర్, ఎంపీటీసీ సభ్యులు జె.ఉదయకుమారి, ఉపసర్పంచ్ గాదె సురేష్, రోటరీ ప్రతినిధి కోటా శ్రీనివాసరావు, పాఠశాల చైర్మన్ షేక్ బాజి, ప్రధానోపాధ్యాయులు బొజ్జా సురేష్, కె.రవీంద్రబాబు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

దాతల దాతృత్వం వెలకట్టలేనిది

విశాలాంధ్ర - భట్టిప్రోలు : గ్రామీణ ప్రాంత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థులకు అండగా నిలుస్తున్న దాతల దాతృత్వం వెలకట్టలేనిదని తమ్మన మల్లికార్జునరావు ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ పులికొండ మల్లికార్జునరావు అన్నారు. పాఠశాలలో విద్యనభ్యసించి హైదరాబాదులో స్థిరపడిన పూర్వ విద్యార్థి బట్టు నాంచారయ్య తన తండ్రి బట్టు వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం పాఠశాలకు 200 స్టీల్ గ్లాసులను మంగళవారం అందజేశారు. విద్యార్థులకు తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని దాత తెలియజేశారు. పూర్వ విద్యార్థి నాంచారయ్యకు కరస్పాండెంట్ మల్లికార్జునరావు, ప్రధానోపాధ్యాయులు సి.రామకోటేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బట్టు రామారావు, బండారు శ్రీనివాసరావు, గ్రామ ఉపసర్పంచ్ బూర్లె రాం ప్రసాద్, ఉపాధ్యాయులు ఉమామహేశ్వరరావు, కోటేశ్వరమ్మ, శ్రీ సత్యరత్న, అనూల్‌హక్, చేబ్రోలు శ్రీనివాసరావు, మురళీధరరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో డౌన్ సిండ్రోమ్ దినోత్సవం

విశాలాంధ్ర - భట్టిప్రోలు : ప్రత్యేక అవసరాల చిన్నారుల పాఠశాల నాన్ భవిత కేంద్రంలో మంగళవారం ప్రపంచ డౌన్ సిండ్రోమ్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఐఈడి టీచర్ మేరీ ఇవాంజలిన్ ఆధ్వర్యంలో డౌన్ సిండ్రోమ్ కలిగిన చిన్నారులు కె.బుజ్జిబాబు, సుశాంక్‌లను శాలువాలతో సత్కరించి బహుమతులను అందించి భరోసాను కల్పించారు. ఈ సందర్భంగా ఇవాంజిలిన్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల చిన్నారులకు నాన్ భవత కేంద్రంలో ఆట పాటలతో కూడిన విద్యాబోధన, ఫిజియోథెరిపిలతో పాటుగా వినికిడి యంత్రాలు, ఆపరేషన్లు ఉచితంగా చేయిస్తున్నామన్నారు. డౌన్ సిండ్రోమ్ అనేది భౌతిక, మేధో అభివృద్ధిలో జాప్యం కలిగించే జన్యుసంబంధమైన అసాధారణస్థితి అని తెలియజేశారు. అలాంటి లోపాలు ఉన్న చిన్నారులను గుర్తించి సాధారణ విద్యార్థుల మాదిరిగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు భారతుల శ్రీధర్, హవీలా, ఐఈడి టీచర్ రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రాగి జావ పంపిణీ

విశాలాంధ్ర - భట్టిప్రోలు : జగనన్న గోరు ముద్ద కార్యక్రమంలో భాగంగా మండలంలోని వివిద ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఎంపిపి డి. లలితకుమారి, జడ్పిటిసి సభ్యురాలు టి.ఉదయ భాస్కరి ప్రారంభించారు. ఈ సందర్భంగా పెసర్లంక గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా విద్యాబోధన, మౌళిక వసతులు కల్పిస్తున్న ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు పోషక విలువలు కలిగిన ఆహారంతో పాటు ఆరోగ్యంగా ఉండేందుకు రాగి జావను కూడా అందజేస్తుందన్నారు. విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యనభ్యసించి నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. భట్టిప్రోలు బిఆర్ పాఠశాలలో గ్రామ సర్పంచ్ దారా రవికిరణ్మయి రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రాంరంభించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోవాలి

విశాలాంధ్ర - భట్టిప్రోలు : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ, యువకులకు శిక్షణ వసతి కల్పిస్తున్నందున దరఖాస్తులు చేసుకోవాలని ఏపీఎం శోభన్‌బాబు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజనీరింగ్, ఐటిఐ, డిప్లొమా పూర్తి చేసుకున్న యువతీ యువకులకు 4 నెలల పాటు ఉచిత శిక్షణ, వసతి కల్పించి ప్రముఖ ప్రైవేట్ సంస్థలలో ఉద్యోగాలు కల్పిస్తారన్నారు. గ్రామీణ ప్రాంత నిరుద్యోగులు తమ విద్యార్హత సర్టిఫికెట్ జిరాక్సు, కులధృవీకరణ పత్రం, ఆధార్, బ్యాంక్ ఖాతా పుస్తకం జిరాక్సులతో స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో సంప్రదించాలన్నారు. వివరముల కొరకు జాబ్స్ కోఆర్డినేటర్ సిహెచ్. అరుణ్‌కుమార్ సెల్ నెం : 9392545506 నందు సంప్రదించాలని కోరారు.

కిమ్స్ వైద్యశిబిరానికి విశేష స్పందన



విశాలాంధ్ర - జె.పంగులూరు : చిన్న మల్లవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఒంగోలు కిమ్స్ వైద్యశాల నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించినట్లు చిన్న మల్లవరం సర్పంచ్ చిలుకూరి వీరయ్య తెలిపిపారు. కిమ్స్ వైద్యులు పి.రామాంజనేయులు అధ్వర్యంలో 250 మంది రోగులకు షుగరు, బిపి, ఈసిజి పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందజేశారు. మెరుగైన వైద్య పరీక్షలకు 20 మంది రోగులను వైద్యశాలకు సిఫార్సు చేశారు. బాచిన రామ సుబ్బారావు, కొండ్రగుంట వెంకట రమణ, చిలుకూరి అనంత రామయ్య సహకారాన్ని అందించారు. వైద్యశిబిర సమన్వయకర్త తాళ్ళూరి రామాంజనేయులు, కిమ్స్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పి. కాలేషావలి పాల్గొన్నారు.

గోరుముద్దతో పాటు రాగిజావ

విశాలాంధ్ర - యద్దనపూడి : రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థినీ విద్యార్థులకు, జగనన్న గోరుముద్దతోపాటు రాగిజావ పంపిణీ కార్య క్రమంను మండలంలోని పోలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పర్చూరు డిప్యూటీ డీఈవో ఏ కిరణ్ కుమార్ ప్రారంభించగా, యద్దనపూడిలో స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఎంపీపీ పి.రజిని ప్రారంభించారు. రాగి జావా ప్రోటీన్ రీచ్ ఫుడ్ దీనిని తీసుకోవడం వలన విద్యార్థినీ విద్యార్థులకు రక్తహీనత తొలగి పోయి ఆరోగ్యంగా ఉంటారని విధిగా ప్రతిరోజు దీనిని తీసుకోవాలని అన్నారు. ఎంపీడీవో షేక్ ఖాసిం వలి గ్రామ సర్పంచ్ షేక్ మహబూబ్ సుభాని యద్దనపూడి సర్పంచ్ రేణుకమ్మ ప్రధానోపాధ్యాయులు రావి శ్రీనివాసరావు ఉన్నారు.

చిన్నారుల ఆరోగ్యానికి రాగిజావ ఎంతో మేలు: కలెక్టర్

విశాలాంధ్ర - బాపట్ల : ప్రభుత్వం పంపిణీ చేసే రాగిజావ చిన్నారుల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని కలెక్టర్ కె.విజయకృష్ణన్ తెలిపారు. బాపట్ల, చీరాల శాసనసభ్యులు కోన రఘుపతి, కరణం బలరామకృష్ణమూర్తితో కలిసి జగనన్న గోరుముద్దలో భాగంగా బడి పిల్లలకు రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చదువులు మెరుగుపరచడానికి ప్రభుత్వం విశేషంగా కృషిచేస్తుందని ఈ సందర్భంగా కలెక్టరు చెప్పారు. ప్రభుత్వం కల్పించే అవకాశాలను సద్విని యోగం చేసుకుని విద్యార్థులు అభివృద్ధి చెందాలన్నారు. విద్యారంగం అభివృద్ధికి ముఖ్యమంత్రి చేస్తున్న కృషిని ఆమె వివరించారు. చిన్నారులు ఆరోగ్యంగా ఎదగడానికి జగనన్న గోరుముద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. అధిక పోషకాలున్న రాగిజావ పంపిణీ ఎంతో మంచి కార్యక్రమం అన్నారు. ముఖ్యంగా బాలికల్లో రక్తహీనత నివారణకు దోహద పడుతుందన్నారు. జిల్లాలో 1421 పాఠశాలల్లో 1లక్షా 8 వేల 314 మంది విద్యా ర్థులు లబ్ధిపొందుతున్నారని ఆమె చెప్పారు. రోజుమార్చి రోజున రాగిజావ పంపిణీకి ప్రభుత్వం ప్రతినెల రూ.2.8 కోట్ల నిధులు వెచ్చించనుందన్నారు. చిన్నారులకు పౌష్టికాహారం అందించడానికి జగనన్న గోరుముద్ద కార్య క్రమాన్ని ముఖ్యమంత్రి సమర్థంగా అమలు చేస్తున్నారని బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతి అన్నారు. ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులంద రిని తన స్వంత బిడ్డలుగా సి.ఎం చూసుకుంటున్నారని వర్ణించారు. విద్యార్థుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషిచేస్తుందన్నారు. బలవర్ధకమైన పౌష్టికా హారాన్ని చిన్నారులు తీసుకున్నప్పుడే ఆరోగ్యంగా ఎదుగు తారన్నారు. సంక్షేమ కార్యక్రమాల అమలులో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంతో బాధ్యతగా వ్యవహరిస్తున్నారని ఆయన తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పిస్తూ, నాణ్యమైన విద్యాబోధన అందించడం అభినంద నీయమన్నారు. బాపట్లలోని చిన్నారులంతా ఆరోగ్యంగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. పాఠశాలల్లోని చిన్నారులకు ఇచ్చే రాగిజావ ఎంతో మేలు చేస్తుందని చీరాల శాసనసభ్యులు కరణం బలరామకృష్ణమూర్తి తెలిపారు. నాణ్యత ప్రమాణాలతో రాగిజావను తయారుచేసి విద్యార్థులకు వేడిగా ఇవ్వాలన్నారు. చిన్నారులలో విద్యా, ఆరోగ్యం పెంపుదలకు ముఖ్యమంత్రి జగన్ కృషిచేస్తు న్నారని ఏ.పి మార్కెటింగ్ కమిటి సలహాదారులు బత్తుల బ్రహ్మా నందరెడ్డి అన్నారు. శ్రీ సత్యసాయిబాబా ట్రస్ట్ భాగస్వా మ్యంతో రాగిజావ అందించడం శుభపరిణామమన్నారు. విద్యారంగాన్ని ప్రోత్సహిస్తూ అభివృద్ధి చేయడానికే ఇలాంటి కార్య క్రమాలను అమలు చేస్తున్నారని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి పి.వి. రామారావు, డిప్యూటీ డి.ఇ.ఓ జి.వెంకటేశ్వర్లు, ఎమ్.ఇ.ఓ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రాగి జావాలో అధిక పోషకాలు

విశాలాంధ్ర - నిజాంపట్నం : రాగి జావాలో అధిక పోషకాలు ఎక్కువగా ఉంటాయని ఎంపీపీ మోపిదేవి హరినాథ్ బాబు, జడ్పీటీసీ సభ్యులు నర్రా సుబ్బయ్య, మండల సచి వాలయాల కన్వీనర్ నాజర్ ఖాన్ అన్నారు.జగనన్న గోరు ముద్దలో భాగంగా విద్యార్థులకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన రాగి జావా పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిజాంపట్నం జడ్పీ హైస్కూల్లో వారు ప్రారంభించి విద్యార్థులకు రాగి జావాను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు పోషకాహార లోపంతో బాధపడకూడదనే ఉద్దేశంతో జగనన్న గోరుముద్దలో భాగంగా ఆరోగ్యకరమైన రాగిజావను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు.ఓ మంచి ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన రాగిజావా పంపిణీ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జగనన్న గోరుముద్దలో భాగంగా ప్రతి మంగళ, గురు, శనివారాల్లో విద్యార్థులకు రాగి జావాను అందించనున్నట్లు తెలిపారు.ఈ రాగిజావాతో విద్యార్థులకు ఐరన్, కాల్షియం, మెగ్నీషియం వంటి పోషకాలు సమృద్ధిగా అందుతాయని తద్వారా విద్యార్థులు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు.రోగనిరోధక శక్తిని పెంచేందుకు, రక్తహీనతను నివారించేందుకు ఈ జావా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులందరూ సంపూర్ణ పోషకాహారం కలిగి ఉన్న ఆహారాన్ని తీసుకొని బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మార్కండేయులు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్, పల్లవసేన జిల్లా అధ్యక్షుడు మోపిదేవి శివ నాగరాజు, హెచ్‌ఎం సరళ, వార్డ్ మెంబర్ భాష, నాయుడు వెంకటేశ్వ రరావు, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

జీవనోపాధికి ఇన్సులేటెడ్ వాహనాలు

- ఎమ్మెల్యే కోన రఘుపతి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా మత్స్య పరిశ్రమలో జీవనోపాదిని పొందుతున్న లబ్ధిదారులకు ఇన్సులేటెడ్ వాహనాలు ఎమ్మెల్యే కోన రఘుపతి పంపిణీ చేశారు. కోన మాట్లాడుతూ జీవనోపాధిని పెంపొందించుకొనుటకు రాష్ట్ర ప్రభుత్వం, ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా 40- 60 శాతం రాయితీపై ఇన్సులేటెడ్ వాహనాలు, ఓనర్లుగా చేయడం ద్వారా వారితో పాటు మరి కొంతమందికి జీవనోపాధిని కలిగించే అవకాశం లభిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య అధికారి డాక్టర్ సురేష్ , నిజాంపట్నం మత్స్య శాఖ సహాయ సంచాలకులు పి. గాలి దేవుడు, అగ్నికుల క్షత్రియ డైరెక్టర్ కన్న మామిడియ్య , ముత్తయ్య పాలెం, మత్స్య సహకార సంఘం, మత్స్య శాఖ అభివృద్ధి అధికారి ఎం. రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాగిజావ పంపిణీ

విశాలాంధ్ర - రేపల్లె : విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నప్పుడే బాగా చదివి ఉన్నత శిఖరాలను అదిరోహిస్తారని ఎంపీటీసీ లుక్కా బాపనయ్య తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని నగరం మండలం అద్దంకివారిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం రాగిజావ పంపిణీ చేశారు. బాపనయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విద్యకు పెద్దపీట వేశారని నాడు నేడుతో పాఠశాలల్లో అన్నీ వసతులు కల్పించారన్నారు. విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండే విధంగా జగనన్న గోరుముద్దు కార్యక్రమంతో పౌష్టికాహారం అందిస్తున్నారని తెలిపారు. మంగళవారం నుంచి పోషకాహారం కిట్‌లో రాగిజావ పంపిణీ చేయటం శుభపరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ మన్నెం భాగ్యలక్ష్మి, బొర్రు భరత్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ఖోఖో టోర్నమెంట్ పర్యవేక్షణకు సీతారామరెడ్డి ఎంపిక

విశాలాంధ్ర - జె.పంగులూరు : ఈనెల 20 నుండి 24వ తేదీ వరకు అస్సాం రాష్ట్రంలోని గౌహతి పట్టణంలో జరిగే నాల్గవ అంతర్జాతీయ ఏషియన్ ఖోఖో టోర్నమెంట్ పర్యవేక్షణ అధికారిగా పంగులూరు గ్రామానికి చెందిన మేకల సీతారామరెడ్డి ఎంపికయ్యారు. పంగులూరులోని ఎస్ఆర్ఆర్ ఖో ఖో అకాడమీలో గత 30 సంవత్సరాలుగా 197 రాష్ట్ర, జాతీయస్థాయి ఖోఖో క్యాంపులను నిర్వహించారు. ఇప్పటి వరకు సుమారు 500 మంది జాతీయస్థాయిలో, నలుగురు అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేశారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేకసార్లు బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించారు. ఈ అవకాశం కల్పించిన కేకే ఎఫ్ ఐ కార్యదర్శి ఎం ఎస్ త్యాగి, అధ్యక్షులు సుదాన్షు మిట్టల్ ఎంపికైన సీతా రామరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ఖో ఖో చైర్మన్ డాక్టర్ బాచిన చెంచుగరటయ్య, అధ్యక్షులు టి.ఎస్.ఆర్.కె ప్రసాద్, చీఫ్ ప్యాట్రన్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ,ఎమ్మెస్సార్ కళాశాల చైర్మన్, ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి , శాప్ నెట్ చైర్మన్ కృష్ణ చైతన్య, గ్రామ పెద్దలు సీతారామరెడ్డిని అభినందించారు.

విద్యార్థుల ఉన్నతికి కృషి చేయండి

విశాలాంధ్ర - చీరాల : విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదిగి తల్లి దండ్రులకు చీరాలకు మంచి పేరు తెచ్చే విధంగా విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని శాసనసభ్యులు కరణం బల రామకృష్ణమూర్తి తెలిపారు. చీరాల ఎంయస్,ఎ ప్రైమరీ స్కూల్, రామకృష్ణ పురంలో రోటరీ క్లబ్ ఆఫ్ క్షీరపురి చీరాల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వారానికి మూడు రోజులు రాగి జావ కార్యక్రమాన్ని వంద స్టీల్ గ్లాసుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పాఠశాలలో గ్లాసుల దాత పూర్వ విద్యార్థి మీనాని చీరాల అభినందించారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, చీరాల మండల ఎంఈఓ డి నాగేశ్వరరావు, నన్నపనేని రామకృష్ణ, నాగమల్లేశ్వరరావు బాచిన, అడ్డగడ్డ మల్లికార్జునరావు, శ్రీ కామాక్షి హాస్పిటల్ ఎండి డాక్టర్ తాడివలస దేవరాజు, రావి రమణారావు, రామకృష్ణపురం వైఎస్సార్సీపీ నాయకులు నల్లూరి బ్రహ్మం,భాస్కరరావు, కేబుల్ కృష్ణ,అందే సుబ్బా రాయుడు పసుపులేటి కోటేశ్వరరావు, కౌన్సిలర్లు బత్తుల అనిల్, కీర్తి వెంకట్రావు, మండవ గిరీష్, శివ స్థానిక నాయకులు, పాఠశాల ఉపాద్యాయులు పాల్గొన్నారు.

జగనన్న గోరు ముద్దలో రాగిజావ

విశాలాంధ్ర - చీరాల : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో విద్యార్థుల కోసం ఎన్నో విజయవంతమైన పథకాలు అమలు చేస్తున్నారని చీరాల మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఉదయం ఆంధ్రరత్న పురపాలక ఉన్నత పాఠశాలలో జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాడు నేడు,అమ్మ ఒడి,జగనన్న విద్యా కానుకలతో పాటుగా గోరుముద్దలో రాగిజావ కార్యక్రమం కూడా ఖచ్చితంగా విజయవంతం కావాలని అన్నారు. పిల్లల్లో ఎదుగుదల కోసం రాగుల్లో ఉండే కాల్షియం,బెల్లంలో ఉండే ఐరన్ సమృద్ధిగా రాగిజావ ద్వారా అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ పిఐసయ్య, కౌన్సిలర్ లలితా రాజశేఖర్, ప్రధానోపాధ్యాయులు బిసాల్మన్ రాజు, వైగాంధీ, గుంటూరు త్రివిక్రమ్, రాజేంద్రప్రసాద్, కుమార్, చంద్రశేఖర్, పవని భానుచంద్ర మూర్తి పాల్గొన్నారు.

పేదోడి వైద్యానికి భరోసా ఆరోగ్య శ్రీ

- డాక్టర్ తాడివలస దేవరాజు

విశాలాంధ్ర - చీరాల : హెర్నియా సమస్యతో బాధపడుతున్న వారు నిర్లక్ష్యం చేయకుండా ఆరోగ్యశ్రీ వైద్య సేవల ద్వారా ఉచిత వైద్యాన్ని చేయించుకోవాలని డాక్టర్ గవిని లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్లో నిర్వహించిన ఉచిత హెర్నియా వైద్య శిబిరంలో 53 మందికి ఉచిత కన్సల్టేషన్,రక్త పరీక్షలు,వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తాడివలస దేవరాజు మాట్లాడుతూ చీరాలలోని అన్ని రకాల ఎముకల ఆపరేషన్లు,జనరల్, లాప్రోస్కోపి ఆపరేషన్లు,కిడ్నీ రాళ్ల ఆపరేషన్లు,చెవి, ముక్కు, గొంతు ఆపరేషన్లు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా శ్రీ కామాక్షి కేర్ హిస్పటల్లో అందిస్తున్నామని అన్నారు. పేషెంట్ చేరిన 24 గంటల లోపే ఆపరేషన్ కు సంబంధించిన అనుమతులను ట్రస్ట్ అందజేస్తుందని తెలిపారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ వైద్యసేవలను బాపట్ల,పర్చూరు, చీరాల నియోజకవర్గ ప్రజలందరు కూడా వినియోగించుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జనరల్ లాప్రోస్కోపి సర్జన్ డాక్టర్ గవిని లక్ష్మీ నారాయణ, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ తులసిరాం,ఎముకల స్పెషలిస్ట్ డాక్టర్ ముఖేష్ రెడ్డి,హాస్పటల్ జీ యం తాడివలస సురేష్, ఆరోగ్యమిత్ర అనిల్, బోయాజ్,శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సర్పంచ్‌గా బొలిమేర అనీల్

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి గుంటూరు జిల్లా జడ్పీ వేదికగా ఉత్తమ సర్పంచ్‌ల అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో బాపట్ల మండల ఉత్తమ సర్పంచ్‌గా బొలిమేర అనిల్ కుమార్‌కు జడ్పీ చైర్మన్ కత్తెర హెన్రీక్రిస్టినా ఉత్తమ సర్పంచ్ అవార్డు, ప్రశంసపత్రం అందజేశారు.

నేటి నుంచి 'మీమాట - నాబాట'

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : నియోజకవర్గంలోని ప్రతి ఇంటిని తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులతో కలిసి మీ మాట నా బాట కార్యక్రమాన్ని పిట్లవానిపాలెం మండలం లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో పూజల అనంతరం ప్రారంభించనున్నట్లు తెలుగుదేశం పార్టీ బాపట్ల ఇన్చార్జి వేగేసిన నరేంద్ర వర్మ రాజు పేర్కొన్నారు. మంగళవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు ఏర్పాటుచేసిన సమావేశంలో వేగేశన మాట్లాడుతూ ప్రతి ఇంటికి పార్టీ చేపట్టబోయే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు వివరాలను తెలియజేస్తామని తెలిపారు.

అశ్రునయనాలతో సీఐ మల్లి నాగేశ్వరరావు అంతిమ యాత్ర

విశాలాంధ్ర - బాపట్ల : నెల్లూరు జిల్లా ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో విధి నిర్వహణలో ఉన్న సీఐ మల్లి నాగేశ్వరరావు గుండె నొప్పితో ఒక్కసారిగా కుప్పకూలి ఆస్పత్రికి తరలించే లోపు మరణించారు. సీఐ స్వగ్రామం చీరాలలోని రాంనగర్‌లో మంగళవారం అంత్యక్రియలు జరిగాయి. జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ సీఐ నాగేశ్వరరావు పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి తీవ్ర శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులను, బంధువులను పరా మర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖకు మల్లి నాగేశ్వరరావు చేసిన సేవలు ఎనలేనివని ఆయన లేని లోటు తీర్చలేనిదని తెలిపారు. ఆయన కుటుంబానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడు అండగా ఉంటుం దని శాఖాపరంగా రావాల్సిన అన్ని రకాల పరిహారాలు రాయితీలు సకాలంలో అందించడానికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం పోలీస్ శాఖ అధికార లాంఛనాలతో సి.ఐ మల్లి నాగేశ్వరరావు పార్థివ దేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. సీఐ మల్లి నాగేశ్వరరావు 1996లో పోలీస్ శాఖలో ఆర్ఎస్ఐగా ఉద్యోగం సాధించారు. 2007లో అర్.ఎస్.ఐ నుండి సివిల్ ఎస్.ఐ కన్వర్షన్ ద్వారా నియమితులై నెల్లూరు జిల్లాలోని మర్రిపాడు, నెల్లూరు త్రీ టౌన్, తడ పోలీస్ స్టేషను లలో ఎస్.ఐ గా విధులు నిర్వహించారు. ఆ తర్వాత సీఐగా పదోన్నతి పొంది నరసరావుపేట టూటౌన్, పొన్నూరు టౌన్, గుంటూరు ఈస్ట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లలో విధులు నిర్వహించారు. అనంతరం ఏ.సి.బి లో విధులు నిర్వహించి అక్టోబర్ 2022 లో ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌కు సీఐగా బదిలీపై వచ్చారు. సిఐ నాగేశ్వరరావుకు భార్య వెంకటలక్ష్మి, కుమారుడు అంజనీకుమార్ ఉన్నారు. ఆయన మృతిపట్ల జిల్లా పోలీస్ అధికారులు సహోద్యోగులు విచారం వ్యక్తం చేసి, ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో చీరాల డీఎస్పీ పి.శ్రీకాంత్ , డీఎస్పీ సీఐ ఏ. శ్రీనివాస్ ,చీరాల రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ కె.సోమశేఖర్, రూరల్ సీఐ ఏ.మల్లికార్జునరావు, బాపట్ల రూరల్ సీఐ జీ.వేణుగోపాలరెడ్డి, వేల్ఫేయిర్ ఆర్.ఐ బి.శ్రీకాంత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పించిన ఎస్పీ వకుల్‌జిందాల్

సింగరకొండలో రూ.12కోట్లతో అభివృద్ధి పనులు

విశాలాంధ్ర-అద్దంకి : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సింగరకొండ శ్రీప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో గడచిన రెండేళ్ల కాలంలో రూ.12 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ కోట శ్రీనివాసకుమార్ తెలిపారు. దేవస్థానం పాలకమండలి పదవీకాలం ఈనెల 23తో పూర్తి కానున్న నేపథ్యంలో చేపట్టిన అభివృద్ధి పనుల గురించి మంగళవారం సింగరకొండలోని చైర్మన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో చైర్మన్ కోట శ్రీనివాసకుమార్ వివరించారు. దేవస్థానంలో పొంగలిశాల, భక్తుల విశ్రాంతిశాల భవనం, నిత్యాన్నదాన భవనం ఆధునీకరణ, యాగశాల, ప్రసాదాల పోటు భవనం, వంటి వివిధ అభివృద్ధి పనులను పూర్తి చేసినట్లు తెలిపారు. రూ.8కోట్ల దేవాదాయశాఖ నిధులతో దేవస్థానం రాతిముఖ మండపం పనులు జరుగుతున్నాయన్నారు. దాతల విరాళాలతో రూ.18 లక్షలతో స్వామివారికి బంగారు తమలపాకులు తయారు చేయించినట్లు తెలిపారు. దేవస్థానం అభివృద్ధి పనులకు నిధులు మంజూరుకు సహకరించిన టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి పాలకమండలి తరపున కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో దేవస్థానం పాలకమండలి సభ్యులు వంకాయల సరస్వతి, జమ్మలమడక రమాదేవి, కుందుర్తి రజని తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో నాగలక్ష్మికి ఉగాది పురస్కారం

విశాలాంధ్ర - నిజాంపట్నం : జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాన్ని మండలంలో సమర్థవంతంగా నిర్వహించి గ్రామీణ ఘన వ్యర్థాల నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన నిజాంపట్నం ఎంపీడీవో ఎస్.నాగలక్ష్మికి ఉత్తమ ఎంపీడీవోగా ఉగాది పురస్కారం లభించింది. మంగళవారం గుంటూరులో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, ఐటిసి ఉన్నతాధికారుల చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు ఎంపీపీ మోపిదేవి విజయ నిర్మల, హరినాథ్ బాబు, జడ్పీటీసీ సభ్యులు నర్రా సుబ్బయ్య, మండల సచివాలయాల కన్వీనర్ నాజర్ ఖాన్, మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు, పలువురు అభినందనలు తెలియజేశారు.

చిన్నారులకు వరం పోషణ్ అభియాన్ పథకం

విశాలాంధ్ర - కొరిశపాడు : మండలంలోని స్త్రీ శిశు సంక్షేమ శాఖ కేంద్రంలో మంగళవారం నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహించే పోషణ్ అభియాన్ పథకం ద్వారా పోషణ్ పక్వాడ్ అందించే సమతుల్య ఆహారాన్ని గర్భిణీలు బాలింతలు చిన్నారులు విధిగా ఉపయోగించుకోవాలని సీడీపీవో కృష్ణకుమారి తెలిపారు. గర్భిణీలలో రక్తహీనత నివారణపై అవగాహన కల్గించారు. తిమ్మనపాలెం గ్రామంలోని అంగన్వాడి సెంటర్లో చిన్నారులకు కోడుగుడ్డు తినే విధానాన్ని వివరించారు. బిడ్డకు ఆరు మాసాల వరకు తల్లిపాలు ఇచ్చే విధంగా కాన్పు సమయంలో కోల్పోయిన రక్తాన్ని ఐఎఫ్ఎ ఐరన్ టాబ్లెట్స్ ద్వారా మళ్లీ పొందేవిధంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కడుపులో శిశువు ఉన్నప్పుడు నుండి మూడు సంవత్సరాల వయసు వరకు సమతుల్య ఆహారాన్ని అందించే కాలాన్ని గోల్డెన్‌డేగా పాటించాలని అంగన్వాడి సెంటర్‌కు వచ్చే గర్భిణీలు బాలింతలు చిన్నారులు సమతుల్య పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కొరిశపాడు ఐసిడిఎస్ సూపర్వైజర్లు కె ఇందిర ఏ అరుణాదేవి, అంగన్వాడి కార్యకర్తలు, కార్యాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాగిజావతో ఎముకలకు పటుత్వం

విశాలాంధ్ర - కొరిశపాడు : రాగిజావతో శరీరంలోని ఎముకల్లో పటుత్వం కలిగి ఉంటుందని సర్పంచ్ విజయ్‌కుమార్ తెలిపారు. కొరిశపాడు గ్రామంలోని జగజ్జీవన్ రామ్ కాలనీలోని ఎంపీపీ స్కూల్ నందు మధ్యాహ్నం భోజనం సమయంలో విద్యార్థులకు రాగి జావా అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచి విజయ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు సమతుల్య ఆహారం తీసుకొని బలంగా ఉండి బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే అభిలాషతో రాగి జావా కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్ మంగళవారం ప్రారంభించారన్నారు. పిల్లలందరికి ఉపయోగకరంగా ఉండే విధంగా తల్లిదండ్రులు ఉపాధ్యాయులు తగు బాధ్యత తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వరదా మురళీకృష్ణ స్కూల్ సిబ్బంది తల్లిదండ్రులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ పద్మజకు ఉత్తమ పురస్కారం

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాన్ని మండలంలో సమర్థవంతంగా నిర్వహించినందుకు ఎంపీడీఓ పద్మజకు ఉగాది ఉత్తమ పురస్కారం లభించింది. మంగళవారం గుంటూరులో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ హెన్ని క్రిస్టినా చేతుల మీదుగా పద్మజ ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. ఉత్తమ ఎంపీడీఓ పురస్కారం అందుకున్న పద్మజ ఎంపీపీ షేక్ బాజీ, రాష్ట్ర రహదారుల డైరెక్టర్ అహమ్మద్ హుస్సేన్, బాపట్ల ఏఎంసీ డైరెక్టర్ మండే విజయ్ కుమార్, పరిషత్ కార్యాలయ సిబ్బంది, సచివాలయాల సిబ్బంది, పలువురు అభినందించారు.

విద్యార్థులకు రాగిజావ పంపిణీ

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : జగనన్న గోరుముద్దలో భాగంగా విద్యార్థులకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన రాగి జావా పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా చందోలు గ్రామ సర్పంచ్ గౌరీ దేవి విజయ కుమారి, మునిర్ ముఖ్యఅతిథిగా పాల్గొని పంపిణీ చేశారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పఠన్ రహమతుల్లా ఖాన్, వార్డ్ నెంబర్ రఫిక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొల్లిపర మురళీధర్ రావు, ఉపాధ్యాయులు బి ప్రసాద్, డి.కనకల్లి, సిఆర్‌పికే ముసలయ్య పాల్గొన్నారు.

నారాయణకు నివాళులర్పించిన గొట్టిపాటి

విశాలాంధ్ర - బల్లికురవ : అంబడిపూడి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు దద్దాల అంజయ్య తండ్రి నారాయణ మృతి చెందారు. మంగళవారం అద్దంకి శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్ నారాయణ మృతదేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం అంజయ్య కుటుంబాన్ని పరామర్శించారు. అంబడిపూడి మాజీ సర్పంచ్ మందలపు సుధాకర్,మండల తెలుగు యువత దూళిపాళ్ల హనుమంతరావు,మల్లినిడి గోవిందరావు,దూళిపాళ్ల పూర్ణయ్య,దరిశి రామస్వామి తదితరులు ఉన్నారు.